epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 92 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 23 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



## దావోస్ పర్యటన ఫలప్రదం


**బ్రాండ్ ఏపీకి ప్రపంచ ఖ్యాతి : చంద్రబాబు**

- గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీపై ప్రపంచానికి సందేశం
- భారత్‌పై పెరుగుతున్న కార్పొరేట్ దిగ్గజాల ఆసక్తి
- పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన : సీఎం
- క్వాంటం వ్యాలీ, సౌర ప్రాజెక్టులపై కీలక చర్చలు
- 36కు పైగా సమావేశాల్లో పాల్గొన్న చంద్రబాబు

**అమరావతి,జనవరి 22 :** దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో తన పర్యటన విజయవంతమైందని, ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 4రోజుల పర్యటనను ముగించుకుని గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ పారిశ్రామిక రంగంలోని ధోరణులను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాల దృక్పథాలను అర్థం చేసుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మిగతా 5 లో





## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృతభారత్

నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోడీ 4

# ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్



## యూపీసీ వోల్ట్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం

రూ.5 వేల కోట్ల పెట్టుబడులు ■ సుమారు 4వేల మందికి ఉపాధి

**హైదరాబాద్, జనవరి 22:** దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని ఆకర్షించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్

మిగతా 2 లో

## వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ

'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ



## ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

- 25 ఏళ్లలో ఇదే అత్యధిక స్థాయి ■ దేశ చరిత్రలో ఆల్‌టైమ్ హై
- 14.20 లక్షల రైతులకు రూ.18,532.98 కోట్ల చెల్లింపు
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో దేశ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసుకుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక స్థాయి అని ఆయన స్పష్టం చేశారు. 2025ఉ26 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన రైతు అనుకూల విధానాల ఫలితంగానే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో చారిత్రక రికార్డు సాధ్యమైందని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు..

మూడు రోజుల్లో నివేదిక 2





2

## తెలుగు సినిమాలకు గద్దర్ అవార్డులు

**ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం**

2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది.



2

## గ్రూప్1 తీర్పు వాయిదా

వచ్చే నెల 5న తీర్పు

స్పష్టం చేసిన హైకోర్టు

గ్రూప్-1పై తెలంగా హైకోర్టు తీర్పు వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించింది. తీర్పును వచ్చే నెల 5కు వాయిదా వేసింది.

## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

- ఫోన్‌ట్యాపింగ్‌కేసులో జారీ
- నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. 2



## అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

కేటీఆర్‌కు నోటీసులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం 3

## మినీ బ్రహ్మోత్సవం

**తిరుమలలో రథసప్తమికి సర్వం సిద్ధం**

- 25న తిరుమలలో రథసప్తమి వేడుకలు
- అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు
- ఒకే రోజులో 8 వాహన సేవలు

5



## కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాక

హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సీతక్క

మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం హెలికాప్టర్ సేవలను ప్రారంభించారు.





# కేటీఆర్‌కు సిట్ నోటీసులు

## నేడు జూబ్లీహిల్స్‌పీఎస్‌లో విచారణ

**హైదరాబాద్,జనవరి 22:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఇటీవలే మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# గ్రూప్-1పై తీర్పు వాయిదా

**హైదరాబాద్,జనవరి 22:** గ్రూప్-1 పై గురువారం తెలంగా హైకోర్టు తీర్పు వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. గ్రూప్-1 పై వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుతో 563 మంది గ్రూప్-1 అధికారుల భవితవ్యం తేలనున్నది. టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. గత నెల 30 న పూర్తి వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఇవాళ నిర్ణయం వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది.

# సినిమాలకు గద్దర్ అవార్డులు

## ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 22:** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్

## సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో గవర్నర్



**హైదరాబాద్,జనవరి 22:** ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడారు గవర్నర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని కొనియాడారు జిష్ణుదేవ్ వర్మ. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ్ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి

నిగమ్లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ను యూపీసీ వోల్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ను కూడా సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3,000 మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే




లక్ష్యంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. నెట్-జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్‌లో కీలక భాగమని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.

# వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ

## 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలపై విస్తృత చర్చ

## హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సుకు విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 22:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరల్డ్ ఎకనమిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలు, 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్', 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్పై సీఎం వివరించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జనవరిలో దావోస్‌లో జరిగే సదస్సులో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలోఅప్ సమావేశం ఎంతో ఉపయోగకరమని ఆయన వివరించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ4ఐఆర్ (సెంటర్‌ఫర్‌ది ఫోర్త్‌ఇండస్ట్రియల్‌రివ్యాల్యూషన్) నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్తో కూడా సీఎం భేటీ అయ్యారు. తెలంగాణలో పరిశ్రమలకు ఉన్న అవకాశాలు, అనుకూల విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఆలోచనను సీఎం పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ఇలాంటి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, సమీప భవిష్యత్తులో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎండీ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' నిర్వహిస్తున్నారని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి చూపుతోందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లోని విభిన్న అంశాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ విజన్‌లో భాగస్వామ్యం పంచుకుంటామని, రాష్ట్ర ఆర్థిక వృద్ధి ప్రయాణంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం కలిసి వస్తుందన్న సంకేతాలు ఇచ్చారు. హైదరాబాదులో ప్రతిభావంతమైన మానవ వనరులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సీఎం ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై కూడా చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరం భారతదేశంలో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ ఇదేనని, ఇది ఆదర్శ మోడల్‌గా గుర్తింపు సాధించిందని సీఎం గుర్తు చేశారు. పరిశ్రమల అభివృద్ధిలో ఉత్తమ పద్ధతులపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని జెరెమీ జర్గెన్స్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల అభివృద్ధి నమూనా, ఆర్థిక వృద్ధి వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా, దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రికార్డు

మొదటి పేజీ తరువాయి

పౌర సరఫరాల, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయడం, తెలంగాణ రైతాంగం సంపూర్ణ భాగస్వామ్యమే ఈ విజయానికి కారణమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కిందని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రం ఇంత భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. 2020ఉ21లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమిస్తూ, తాజా ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్న రకాలకు తొలిసారిగా అందించిన బోనస్‌ను కలిపి మొత్తం రూ.18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేయడంతో పాటు, తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విదేశీ



ఎగుమతులకు ప్రత్యేక విధి విధానాలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.38 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావడం కూడా ఒక అరుదైన రికార్డేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అంటే రాష్ట్ర జనాభాలో దాదాపు 85 శాతం మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని, ఇందుకు సంవత్సరానికి రూ.13,650 కోట్లు ఖర్చు అవుతోందని వెల్లడించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో నాణ్యత లోపాలు, బ్లాక్ మార్కెట్ అక్రమాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గోదాముల ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిల్వ సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉందని, ఈ గోదాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో సైలో విధానంలో ఆధునిక గోదాములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తేమ నియంత్రణతో నష్టాలను తగ్గించవచ్చని, ప్రారంభ ఖర్చు ఎక్కువైనా దీర్ఘకాలంలో లాభదాయకమని పేర్కొన్నారు. మిల్లింగ్ రంగంపై కూడా మంత్రి స్పందిస్తూ, నిబంధనలు పాటించిన మిల్లర్లకు పూర్తి సహకారం ఉంటుందని, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ఉండదని స్పష్టం చేశారు. పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని మిల్లింగ్ పరిశ్రమకు ప్రోత్సాహక విధానాలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు, పాడీ క్లీనర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని, అన్ని వేళలా రైతులకు అండగా ఉంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై కేంద్ర విచారణ

## ఇద్దరు సభ్యుల బృందం ఏర్పాటు.. మూడు రోజుల్లో నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 22 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)లో పర్యటించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్లలో తలెత్తిన వివాదం, టెండర్లు రద్దు చేయాల్సిన పరిస్థితి, అందుకు గల కారణాలు సహా అన్ని అంశాలపై ఈ బృందం సమగ్ర విచారణ చేపట్టనుంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృంద సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విచారణకు మూడు రోజుల గడువు విధించింది. ఈ లోగా సింగరేణిలో పర్యటించి, నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్లపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో, తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే క్రమంలో ఎస్‌సీసీఎల్ కూడా టెండర్ నోటిఫికేషన్‌ను అధికారికంగా రద్దు చేసింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా మారిందని, అదే సమయంలో సంస్థ అప్పులు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. సింగరేణి విద్యుత్ వినియోగానికి సంబంధించి జెన్‌కో, ట్రాన్స్‌కోలకు చెల్లింపులు చేయలేదని, టెండర్లు, కాంట్రాక్టులన్నీ కేసీఆర్ కుటుంబం నియంత్రణలోనే జరిగాయని విమర్శించారు. అదేవిధంగా, సింగరేణి సీఎస్ఆర్ నిధుల దుర్వినియోగం, ప్రైవేట్ కంపెనీలకు



నిబంధనలకు విరుద్ధంగా పనులు కట్టబెట్టడం జరిగిందని ఆరోపించారు. గత పదేళ్లలో రూ.32 వేల కోట్లకు పైగా సింగరేణి అప్పులు పెరిగాయని, కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎండీని మరో నాలుగు సంవత్సరాలు కొనసాగించారని, ప్రస్తుతం సింగరేణి ఇన్‌ఛార్జి సీఎండీతోనే నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# కాలిబాట నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాక

- హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు, జనవరి 22:** మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.

# 27న బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె

## ఐదురోజుల పని విధానానికి డిమాండ్




**హైదరాబాద్, జనవరి 22:** దేశవ్యాప్తంగా ఈనెల 27న సమ్మె నిర్వహిస్తామని బ్యాంకు ఉద్యోగ సంఘాలుహెచ్చరించాయి. 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ), జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(జిఐసి) వంటి సంస్థలలో కొనసాగుతున్న విధంగా తమకు 5 రోజులను అమలు చేయాలని గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి రోజు 42 నిమిషాలు అధికంగా పనిచేస్తామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు అసహనం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ సెక్టార్(ఃజీనీతినిణ ఘాఇఇబినీస)లో పనిచేస్తున్న వారు సామాజిక జీవితానికి దూరం అవుతున్నందున ఈ విధానాన్ని అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పని దినాలను తప్పనిసరిగా అమలు చేయాలని గత ఏడాది మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వడంతో అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆంజనేయ ప్రసాద్ గుర్తు చేశారు. 9 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఖాతాదారులు సైతం తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు జరుగుతున్న సమ్మెకు మద్దతు పలకాలని ఆంజనేయ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. 2024 మార్చిలో వేతన సవరణ సెటిల్‌మెంట్ సమయంలో మిగతా రెండు శనివారాలు కూడా సెలవు ఇచ్చేందుకు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ), యూఎఫ్‌బీయూ మధ్య అంగీకారం కుదిరింది. తాజాగా ప్రకటించిన ఈ సమ్మె కార్యరూపం దాలిస్తే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలపై వరుసగా మూడు రోజుల పాటు ప్రభావం పడనుంది. జనవరి 25, 26 తేదీల్లో బ్యాంకులకు సెలవులు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు ఆదివారాలతో పాటు రెండవ, నాలుగో శనివారాలు సెలవు పొందుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

## బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది

## డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క హామీ



**కొమురం భీం, జనవరి 22:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ది దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పని లో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

# ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

## ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం

## యువతకు శిక్షణ అందించాలన్న సిఎం

**దావోస్, జనవరి 22:** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏ ఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏ ఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏ ఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏ ఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏ ఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించ నున్నారు.



# అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

## కేటీఆర్‌కు నోటీసులపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 22:** కెటిఆర్‌కు సిట్ నోటీసులపై బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదంతా కేవలం డైవర్షన్ స్కీమ్ అంటూ విమర్శలు గుప్పించారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బామ్మర్ది బాగోతం బయటపెట్టడంతో ఈ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం నుంచి సడీచప్పుడు లేకుండా ఇప్పుడే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా ఎ÷-లాన్ చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం అని నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల క్రితం నమోదైన కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్ఎస్ నేత సోమా భరత్ విమర్శించారు. 'నోటీసు ఇచ్చి .. విచారణకు వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వలేదు. రెండ్రోజుల క్రితం మరో సీనియర్‌నేత హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చారు. కేవలం ప్రశ్నిస్తున్న పార్టీ లక్ష్యంగానే నోటీసులు ఇస్తున్నారు. సిట్ ఎందుకు వేశారో కూడా తెలియదు. ఒక పద్ధతి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అక్రమాలను బయటపెడుతుంటే నోటీసులు ఇస్తున్నారు. విచారణకు కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరాం. సాక్షిగా విచారణ చేసినప్పుడు న్యాయవాదిని అనుమతించబోమని ఏసీపీ చెప్పారని భరత్ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

## పట్టుబడ్డ 270మందికి జైలు శిక్ష



**హైదరాబాద్, జనవరి 22:** 2026 న్యూ ఇయర్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవర్‌లో పట్టుబడిన వారిలో 270 మందికి జైలు శిక్ష విధించారు. 2025 డిసెంబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వందలాది మంది పట్టుబడ్డారు. ఈ కేసుల్లో విచారణ చేపట్టిన నగరంలోని పలు న్యాయస్థానాలు మొత్తం 270 మందికి జైలు శిక్ష విధిస్తూ తీర్పులు వెలువరించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను వారి కార్యాలయాలు, కళాశాలలకు పంపిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు సిఫారసులు చేస్తున్నట్లు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

# గోద్రేజ్ చైర్మన్‌తో మంత్రుల భేటీ

## ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ

## హైదరాబాద్ సందర్శించాలని కోరి శ్రీధర్ బాబు



**దావోస్, జనవరి 22:** ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు ముఖ్యంగా స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.



## సంపాదకీయం

# గిరిజన జాతర.. మేడారం!

**కొయ్యు సెక్కితె బొమ్మరా.. కొలిచి మొక్కితె అమ్మరా..!** అంటూ కవి అందెశ్రీ పాడిన పాట ఎంతో అద్భుతమైనది. అందులో ఆధ్మాత్మిక తత్వ చింతనను బాగా వెలవరించారు. భారతదేశ పురాణఇతిహాసాల్లో విగ్రహాలు, దేవుళ్లు, పూజలు కూడా అంతా నమ్మకం, విశ్వాసం, భక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే చెట్టు, పుట్ట, గాలీ,నీరు, రాయిరప్పా అన్నీ మనకు దైవాలే. మనకు మేలుచేస్తున్న ప్రకృతిని దైవంగా కొలవడం ఒక్క భారతీయ సంస్కృతిలోనే చూస్తున్నాం. నమ్మకంతో పూజించడం మన ఆచారం. అది దేవత కావచ్చు.. మైసమ్మ, మారెమ్మ ఇలా ఏ రూపంలో అయినా గ్రామదేవతనలు కొలవడం ఆచారంగా వస్తోంది. అలాంటి ఓ అద్భుతమైన ఆచారంతో కోట్లాదిమంది ఆరాధ్యదైవాలుగా వెలిసిన వారే సమ్మక్క- సారలమ్మలు. సామాన్యమైన గిరిజన కుటుంబానికి చెందిన వీరు అసామాన్యంగా భక్తులు మనస్సులో నిలిచిపోయారు. కేవలం గిరిజనుల నమ్మకం ఇప్పుడు సమస్త జనజాతికి నమ్మకంగా, ఆరాధ్యంగా ఆ దేవతలు వెలిశారు. రెండేళ్లకోమారు జరిగే మేడారాం గిరిజన జాతర చూస్తే..ఆ అమ్మలు జనహృదయంలో ఎంతగా గూడుకట్టుకున్నారో చెప్పలేం. ఇదంతా అమ్మల మీద ఉన్న గౌరవం కావచ్చు..నమ్మకం కావచ్చు.. విశ్వాసం కావచ్చు.. కొలిచి మొక్కిన వారికి కొండంత వేల్పులుగా వారు నిలిచి పోయారు. గుడిలేదు.. గంటలు లేవు...కట్టుబాట్లు లేవు..పూజలు, ఆరాధనలు, హారతులు వంటివి ఏవీ లేకుండా నేరుగా అమ్మలను తలచుకుని రావడం అన్న ఆధ్యాతిక జాతర బహుశా ప్రపంచంలో ఎక్కడా కానరాదు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభం కాబోతున్నది. ప్రారంభానికి ముందే వేలాదిగా భక్తులు తరలివచ్చి గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకుంటారు. కుంభమేళా తర్వాత కోట్ల సంఖ్యలో భక్తులను ఆకర్షించే అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. నాలుగు రోజుల జాతరలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది గద్దెలను అభివృద్ధి చేశారు. జాతరకు నెల ముందు నుంచే లక్షలాది మంది మేడారానికి పోటెత్తారు. నిజానికి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యా యని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర...తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. తన కుటుంబ సభ్యులందరూ మరణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు. సమ్మక్క అదృశ్యమైన తర్వాత, గిరిజన ప్రజలకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయి. 'ఈ గడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరూ వీరుడిలా రాజ్యాన్ని పాలించాలని, ఇక్కడ రెండు గద్దెలు కట్టి రెండేళ్లకొకసారి ఉత్సవం జరిపిస్తే వారి కోరికలు నెరవేరుస్తాను' అని ఆ మాటల సారాంశం. ఈ మాటలను అమ్మ ఆదేశంగా భావించిన గిరిజనులు.. అప్పటి నుంచి అమ్మలకు జాతర నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంలో ఈ మహా జాతర జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అనేక సంప్రదాయాలు పాటిస్తారు. మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. రెండవ రోజు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడవ రోజు అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. దీంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించు కోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

# వీబీ జీ రామ్ జీకు వ్యతిరేకంగా ఆందోళన

- పార్లమెంట్ వేదికగా పోరాడుతాం
- విపక్ష నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 22:** ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ బిల్లు 'వీబీ జీ రామ్ జీ'కు వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్రం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకుని ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించేంత వరకూ తాము పోరాడతామని చెప్పారు. దీనిపై పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లోనూ పోరాటం సాగిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. జవహర్ భవన్‌లో గురువారం నాడు జరిగిన నేషనల్ ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్మికుల సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశానికే చరమగీతం పాడాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. రాజుల పాలనలా ఇండియాను మార్చాలని బీజేపీ అనుకుంటోందన్నారు. పేద ప్రజలందరికీ పని హక్కును ఎంజీఎన్ఆర్ఈజీఏ కల్పిస్తే, ఆ ఉద్దేశాన్ని దెబ్బతీయడమే బీజేపీ, మోదీ కోరిక అని తప్పుబట్టారు. కొద్దికాలం క్రితం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వాళ్లు తెచ్చారని, అంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాటం జరిపామని, రైతులు దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేసారు. దాంతో ఆ నల్ల చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. రైతుల విషయంలో అప్పుడు చేసినట్టే ఇప్పుడు అదే పని కార్మికుల విషయంలోనూ చేస్తున్నారని అన్నారు. కొత్త చట్టంతో బీజేపీ పాలిత రాష్ట్రాలకే పనులు, నిధులను కేంద్రం కేటాయిస్తుందని చెప్పారు. పేద ప్రజల పని హక్కును కేంద్రం హరిస్తూ, ఆధునిక భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని కుట్ర జరుపుతోందని రాహుల్ ఆరోపించారు. కేంద్రాన్ని అడ్డుకునేందుకు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతిఒక్కరూ ఐక్యంగా నిలబడినప్పుడే కేంద్రం వెనక్కి తగ్గుతుందన్నారు. ఈ సదస్సులో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరువనంతపురం-చర్లపల్లి మధ్య

# అమృతభారత్ ఎక్స్‌ప్రెస్

### నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ,జనవరి 22:** తెలుగు రాష్ట్ర రైల్వే ప్రయాణికులకు శుభవార్త. మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ అమృత్ భారత్ రైలు నడవబోతోంది. 23న శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. తిరువనంతపురం- చర్లపల్లి మధ్య ఈ అమృత భారత్ రైలు నడవనుంది. అప్పటికే చర్లపల్లి-ముజఫర్ పూర్ (బీహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. తిరువనంతపురం-చర్లపల్లి మధ్య నడిచే ఈ రైలు తెలంగాణకు కేటాయించిన రెండో అమృత్ భారత్ రైలు. ఈ రైలు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి ఉదయం 7.15కు బయలుదేరి.. మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 2.45కు తిరువనంతపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, తర్వాతి రోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు తెలంగాణలోని నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆధునిక పద్ధతుల్లో, స్వదేశీ సాంకేతికతతో డిజైన్ చేశారు. వివిధ సౌకర్యాలను అందించే ఈ రైళ్లు అందుబాటు ధరల్లోనే ప్రయాణికులకు సేవలు అందించబోతున్నాయి.

# స్వల్పంగా దిగివచ్చిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ,జనవరి 22 :** బంగారం.. వెండి ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. గత కొద్దిరోజులగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గోల్డ్, సిల్వర్ పోటాపోటీగా రాకెట్‌లా దూసుకుపోయాయి. సరికొత్త రికార్డ్‌లు సృష్టిస్తూ కొనుగోలుదారులను బెంబేలెత్తించాయి. అలాంటిది బుధవారం అగ్ర రాజ్యాధినేతల నుంచి వచ్చిన సానుకూల ప్రకటనలు పసిడి పరుగులకు బ్రేక్‌లు పడేలా చేశాయి. భారతదేశంతో వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకుంటున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లేయెన్ ప్రకటించారు. అలాగే అతి త్వరలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని ట్రంప్ ప్రకటించారు. ఈ ఇద్దరి నేతల ప్రకటనతో బంగారం, వెండి ధరలు దిగొచ్చినట్లుగా కనబడుతోంది. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ఇది కూడా చదవండి: ఉసబీపూ: 'బోర్డ్ ఆఫ్ పీస్'పై అగ్ర రాజ్యాలు ఘర్షణ.. కారణమిదేనా!? తులం గోల్డ్‌పై రూ.2,290 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,54,310 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.2,100 తగ్గడంతో రూ.1,41,450 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,720 తగ్గడంతో రూ.1,15,730 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక సిల్వర్‌కు బ్రేకులు పడ్డాయి. ఈరోజు కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3,40,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.3,25, 000 దగ్గర అమ్ముడవుతోంది.





## భోజ్‌శాలపై సుప్రీం

# కీలక ఆదేశాలు

### ఇరు మతస్థుల పూజలు, ప్రార్ధనలకు అనుమతి

**భోపాల్, జనవరి 22:** మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్ధనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ముస్లింలు శుక్రవారం ప్రార్థనలు చేసుకోవచ్చని అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. నమాజ్ చేసుకునేందుకు వచ్చే ముస్లిం కమ్యూనిటీ వ్యక్తుల జాబితాను జిల్లా యంత్రాంగానికి అందజేయాల్సి ఉంటుందని సీజేఐ సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పాంచోలితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇరువర్గాల వారు పరస్పరం గౌరవించుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించింది. భోజ్‌శాల 11వ శతాబ్దం నాటి కట్టడమని, సరస్వతీ దేవి ఆలయమని హిందువుల వాదనగా ఉంది. ముస్లింలు దీనిని కమల్ మౌలా మసీదుగా పిలుస్తుంటారు. 2003లో ఇందుకు సంబంధించి ఏఎస్ఐ ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం నమాజ్‌లు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ చేసుకోవచ్చని, హిందువులు వసంత పంచమి పూజలు నిర్వహించుకోవచ్చని, ప్రతి మంగళవారం వారికి అనుమతి ఉంటుందని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. అయితే.. వసంత పంచమి శుక్రవారం నాడు వస్తే ఎలాంటి ఏర్పాట్లు చేయాలనేది అందులో పేర్కొనలేదు. ఈసారి జనవరి 23న వసంత పంచమి, శుక్రవారం కలిసి రావడంతో ఇరువర్గాలు తమ మతపరమైన ప్రార్థనలు నిర్వహించు కునేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరాయి.

# ఎర్రచందనం పట్టివేత

**రైల్వే కోడూరు,జనవరి 22:** అక్రమంగా కారులో తరలిస్తున్న 28ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే కోడూరు టాస్క్ ఫోర్స్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో నెల్లూరు- గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను తనిఖీ చేపట్టారు. వీరు వెంకటాచలం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా, ఒక మోటారు సైకిల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వీరితో పాటు వెనకే వస్తున్న ఒక కారును అడ్డగించి,కారును ఆపిన వెంటనే అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేయగా టాస్క్ ఫోర్సు పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని కారులో తనిఖీ చేయగా అందులో 28ఎర్రచందనం దుంగలు లభించాయని అన్నారు. నలుగురిని నెల్లూరు,తిరుపతి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించి వీరిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

# క్రొయేషియాలో భారత ఎంబసీపై దాడి..

### ఎంఈఏ తీవ్ర అభ్యంతరం

**న్యూఢిల్లీ:** ఐరోపా దేశం క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి ఖలీస్థానీ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించడంపై భారత్ ఘాటుగా స్పందించింది. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో కోరింది. వియన్నా తీర్మానం ప్రకారం దౌత్య ప్రాంగణంలో నిబంధనల ఉల్లంఘన జరగరాదని, ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా రక్షణ కల్పించాల్సి ఉంటుందని ఎంఈఏ పేర్కొంది. 'భారత వ్యతిరేక శక్తులు మా రాయబార కార్యాలయంలో చొరబడి విధ్వంసం సృష్టించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యవహారాన్ని ఢిల్లీ, జాగ్రెబ్‌లోని క్రొయేషియా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాం. ఇలాంటి ఘటనలు వాటి వెనుక ఉన్న వ్యక్తుల స్వభావం, ఉద్దేశాలను సూచిస్తాయి. చట్టాన్ని అమలుచేసే సంస్థల అధికారులు వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలి' ఎంఈఏ పేర్కొంది. కాగా, జాగ్రెబ్‌లోని భారత రాయబార కార్యాలయంలోకి కొందరు ఖలిస్థాన్ వేర్పాటువాదులు చొరబడి విధ్వంసం సృష్టించినట్టు గురువారం ఉదయం వార్తలు వెలువడ్డాయి. భారత రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఈయూ నేతలు న్యూఢిల్లీలో పర్యటించనున్న వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.

### క్రొయోషియాలో మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది క్రొయేషియాలో పర్యటించారు. ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా కూడా ఆయన రికార్డును సొంతం చేసుకున్నారు. జాగ్రెబ్‌లో మోదీకి క్రొయేషియా ప్రధాని ఆంద్రెజ్ ప్లెంకోవిక్ సాదర స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సమావేశంలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీలు కూడా హాజరయ్యారు. మోదీ పర్యటనలో వ్యవసాయం, సంస్కృతి, సైన్స్ రంగాల్లో నాలుగు ఎంఓయూలపై సంతకాలు .జరిగాయి.



# దావోస్ పర్యటన ఫలప్రదం

మొదటి పేజీ తరువాయి

గత మూడు రోజులుగా జరిగిన వివిధ సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, పర్యాటకం వంటి కీలక రంగాల్లో రాష్ట్రం సాధించిన విజయాలను, ప్రగతిని సమర్థవంతంగా ప్రపంచానికి తెలియజేశామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రపంచ కార్పొరేట్ దిగ్గజాలు భారత్‌పై అధిక ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (జమీా) ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో ఉన్న యువశక్తి, సమర్థవంతమైన నాయకత్వం, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాల కారణంగా అన్ని రంగాల్లోనూ కంపెనీల స్థాపనకు అవకాశాలు గణనీయంగా పెరిగాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ సానుకూల వాతావరణాన్ని అందిపుచ్చుకుని ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తన పర్యటన సాగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా విశాఖపట్నంలోని టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ పురోగతి, అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ, కర్నూలులో ప్రతిపాదించిన సౌర విద్యుత్ ప్రాజెక్టులపై ఫలవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సాంకేతిక, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత చురుకుగా పాల్గొన్నారు. ఆయన మొత్తం 36కు పైగా సమావేశాల్లో పాల్గొన్నారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో మూడు కీలక సమావేశాలు



నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక వేదిక ప్రాంగణంలో 16 మంది ప్రపంచ స్థాయి పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశమయ్యారు. అలాగే, తొమ్మిదికి పైగా సెషన్లు, ఇతర సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడంలో దోహదపడతాయని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింతగా ప్రచారం చేసేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ విధానాల ప్రభావాన్ని అంచనా వేయడంలో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు కీలకపాత్ర పోషించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా, యూరప్‌లో నివసిస్తున్న తెలుగు ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశమై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు. దావోస్ సదస్సు వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రపంచానికి వివరించారు. మొత్తం మీద, ఈ పర్యటన రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేయడమే కాకుండా, భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### క్యాప్ జెమిని సీఈఓతో నారా లోకేశ్ భేటీ

క్యాప్ జెమిని సీఈవో ఐమన్ ఎజ్జట్‌తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇంటిగ్రేటెడ్ ఐటీ డెవలప్ మెంట్ సెంటర్, జీసీసీ, వర్టికల్ బీపీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ యూనివర్సిటీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆ×ఎ)తో కలిసి పనిచేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనపై. క్యాప్ జెమిని సీఈవో సానుకూలంగా స్పందించారు. భారత్ లో ఏఐ, క్లౌడ్-రెడీ వర్క్‌ఫోర్స్ కోసం 45 వేల మంది ఉద్యోగుల నియామక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఇది త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ముగిసిన చంద్రబాబు దావోస్ పర్యటన


### నాలుగు రోజుల పాలు బిజీగా కార్యక్రమాలు

### దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు

**అమరావతి,జనవరి 22:** దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బయల్దేరారు. శుక్రవారం ఉదయం 8.25 నిమిషాలకు హైదరాబాద్ కు చేరుకోనున్నారు. మొత్తంగా నాలుగు రోజుల దావోస్ పర్యటనలో 36కు పైగా కార్యక్రమాలకు సీఎం హాజరయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో 3 సమావేశాల్లో పాల్గొన్న చంద్రబాబు.. ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక వద్ద ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మి మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ సహా 16 దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో నిర్వహించిన 9కి పైగా సెషన్స్, సమావేశాల్లో పాల్గొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదిక నుంచి ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకునేందుకు ఉపకరించాయని సీఎం



చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను మరింత విస్తరించేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీలను అంచనా వేసేందుకు కూడా సదస్సు దోహదం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2025 దావోస్ పర్యటన ద్వారా ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారం అయ్యాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, టూరిజం లాంటి రంగాల్లో ఏపీ సాధిస్తున్న విజయాలను వనరుల్ని సమర్ధంగా వివరించామని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్ వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. యువ శక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా ప్రస్తుతం ప్రతీ రంగంలో భారత్ లో కంపెనీలకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఇక, యూరప్ లోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో చంద్రబాబు ఆత్మవిశ్వాసం నింపారు. ఇక, దావోస్ వేదికగా జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులకూ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే, రేపు ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్ చేరుకుని.. అక్కడి నుంచి అమరావతికి బయల్దేరనున్నారు. ఉదయం 11.30 గంటల నుంచి అమరావతి సచివాలయంలో అధికారిక కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొంటారు.



# సోషల్ మీడియాకు పిల్లలను దూరం చేసే యోచన

### ఆస్ట్రేలియా తరహాలో కట్టడికి యత్నం

### సిఎం రేవంత్‌తో ప్రత్యేకంగా నారా లోకేశ్ భేటీ

**దావోస్, జనవరి 22:** ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడం పై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించిందని, ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్‌లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం' అని లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం అని లోకేశ్ తెలిపారు.

# ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్'

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సమయం ఆదా చేయడమే అతిపెద్ద లాభం. ఇదే రాష్ట్రానికి ఆర్థిక పోటీలో ఆధిక్యతను ఇస్తోంది. దీనికోసం రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (రాఞాదీ) ప్రతినెలా సమావేశమై ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, అంతర్గత సమస్యలను పరిష్కరిస్తోంది. భూమి, యుటిలిటీస్, పర్యావరణ అనుమతుల వంటి అంశాల్లో వరుస అనుమతులకు బదులుగా ప్యారలల్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులు ప్రారంభించే సమయాన్ని గణనీయంగా తగ్గించాం" అని వివరించారు.

### 'డే-జీరో రెడీ స్టేట్' అంటే...!

2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 'డే-జీరో రెడీ స్టేట్'గా గుర్తింపు పొందేలా చేయడమే తమ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అంటే, పెట్టుబడి నిర్ణయం తీసుకున్న కొన్ని వారాల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారం కాకుండా, పటిష్టమైన వ్యవస్థ ఆధారంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. రియల్ టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్ ద్వారా జాప్యాన్ని ముందుగానే గుర్తించి, అవరోధాలను తొలగిస్తున్నామని వివరించారు.

### నిబంధనల సరళీకరణ

పరిపాలనలో వేగాన్ని పెంచేందుకు డీ-రెగ్యులేషన్ డ్రైవ్‌లో భాగంగా గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నాలా చట్టాన్ని రద్దు చేశామని, డీ-క్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. తాము రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తున్నామని, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇస్తూ, అధిక ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇది సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

### ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని కొన్ని నగరాలకే పరిమితం చేయకుండా, అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్కును స్థానిక వనరుల ఆధారంగా, అగ్రో-ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇది వలసలను తగ్గించడంతో పాటు, పెద్ద పరిశ్రమలకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఏపీ ప్రత్యేకత అని లోకేశ్ అన్నారు. విధానాల స్థిరత్వం, సంస్థల విశ్వసనీయతతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నమ్మకం, వేగం రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పోటీ వాతావరణంలో ఒక ప్రత్యేక పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెర్నీ సీనియర్ పార్ట్‌నర్ సుకేతు గాంధీ, గూగుల్ ఏసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కాగ్నిజెంట్ గ్లోబల్ సీఎఫ్ఓ జతిన్ దలాల్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండను దర్శించుకున్న పవన్‌కల్యాణ్

### త్రికూటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



**పల్నాడు,జనవరి 22 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనానికి పవన్ వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.5 కోట్లతో చేపట్టిన కొత్తపాలెం-కోటప్పకొండ రోడ్డును ఆయన ప్రారంభించారు. కోటప్పకొండలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు విచ్చేసిన ఆయన త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకుని, మధ్యాహ్న వేళ ప్రత్యేక పాదాభిషేక సేవలో పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, ఫల ప్రసాదం సమర్పించారు. పాదాభిషేకానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కొటప్పకొండ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా మల్రాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు, దేవాదాయశాఖ ఆర్జేసి చంద్రశేఖర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరావు అధ్వర్యంలో పూ-ర్ణకుంభంతో స్వాగతం పలికారు. సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టగా, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఉత్తరద్వారం నుండి ఆలయంలోకి ప్రవేశించారు. ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంటేశ్వరరావు, నియోజకవర్గ ఇంచార్జ్ సయ్యద్ జిలానీ తదితరులు స్వామివారి పూజలో పాల్గొన్నారు.అంతకు ముందు కోటప్పకొండ పర్యటనకు వచ్చిన పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుతో పాటు జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి కోటప్పకొండ ఆలయం వరకు ఆలయం నుంచి నూతన రహదారి ప్రారంభోత్సవం వరకు కూటమి పక్షాల కార్యకర్తలు రోడ్డుకి ఇరువైపులా నిలబడి పూలు, హారతులతో స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూనే ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు.



# మినీ బ్రహ్మోత్సవం..

మొదటి పేజీ తరువాయి

ఈ వేడుకలను వీక్షించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనవరి 24 నుంచి 26 వరకు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీని కూడా నిలిపివేశారు. భక్తుల సౌకర్యార్థం 85 కౌంటర్ల ద్వారా 14 రకాల అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. భద్రత కోసం 1300 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందిని మోహరించారు. భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ 2300 ప్రత్యేక ట్రిప్పులు నడపనుండగా, మెరుగైన పారిశుద్ధ్య చర్యలు, వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఈ వేడుకలను 1000 మంది కళాకారులతో 56 రకాల కళారూపాల ప్రదర్శనలతో మరింత శోభాయమానంగా మార్చనున్నారు. ఈ ఉత్సవాలను ఎస్వీబీసీ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ, టీటీడీ సూచనలను అనుసరించి స్వామివారి వాహన సేవలను వీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల జిల్లాలో ప్రమాదం

### బస్సు, లారీ డ్రైవర్ సహా క్లీనర్ మృతి

**నంద్యాల,జనవరి 22 :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి హైద్రాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి రోడ్డు డివైడర్ దాటి అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. సిరువెళ్ల మెట్ట పై ట్రావెల్స్ బస్సు, లారీ దగ్ధం అయ్యాయి. బస్సు, లారీ మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయాయి. బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ మంటల్లో మృతి చెందగా బస్సు ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. పలువురికి గాయాలు అయ్యాయి. మంటలు చెలరేగిన వెంటనే అటుగా వెళ్తున్న వాహనదారులు అద్దాలు పగలగొట్టడంతో బయటికి వచ్చారు బస్సులోని ప్రయాణీకులు. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. సిర-ువెళ్ల బస్, లారీ దగ్ధం ఘటనలో శ్రీవాణి ఆటో మొబైల్స్ కంటైనర్ లారీలో బైక్ లు రవాణా చేస్తూ దగ్ధం అయ్యింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణీకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ప్రయాణీకులు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ ఓబులేసు అలియాస్ భాస్కర్(50) సజీవ దహనం అయ్యారు. కడప నివాసిగా గుర్తించారు. మృతిచెందిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను ఇంకా గుర్తించలేదు.

## పెండింగ్ చలానాలపై హైకోర్టు సంచలన ఆదేశాలు

-- ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక

-- దాసోజు శ్రవణ్ సి ఎం సి ఎస్ కు ట్వీట్

**హైదరాబాద్ జనవరి 22( సమయం న్యూస్) :** పెండింగ్ ట్రాఫిక్ చలానాల వసూళ్ల పేరుతో ప్రజలను వేధించే చర్యలపై గౌరవ హైకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలు, చట్టం ముందు ప్రభుత్వమూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశాయి. చలానాల పేరుతో రోడ్లపై వాహనదారులపై దౌర్జన్యం చేయడం, బైక్ కీలు లాక్కోవడం, వాహనాలను అడ్డుకోవడం పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు తేల్చి చెప్పింది. వాహనదారుడు స్వచ్ఛందంగా చెల్లిస్తేనే వసూలు చేయాలని, లేదంటే చట్టప్రకారం కోర్టు నోటీసులు జారీ చేయాల్సిందేనని ఆదేశించింది. ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి బలవంతంగా డబ్బులు కట్ చేసేలా ప్రతిపాదించిన 'ఆటో డెబిట్ సిస్టమ్' ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. చట్టబద్ధత లేని, ప్రజావ్యతిరేక నిర్ణయాలు న్యాయసమీక్షలో నిలబడవని హైకోర్టు స్పష్టంగా చూపించింది. ప్రభుత్వం ఆదాయం కోసం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, రాజ్యాంగ పరిమితుల్లోనే వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ తీర్పు గుర్తు చేస్తోంది. చట్టం ముందు అందరూ సమానులే అన్న మౌలిక సత్యాన్ని ప్రభుత్వం మర్చిపోవద్దు. ఎంపిక--2: సోషల్ మీడియా / ఙ (ట్విట్టర్) కోసం షార్ప్ వెర్షన్పెండింగ్ చలానాలపై హైకోర్టు స్పష్టమైన తీర్పు

బలవంతపు వసూళ్లు వద్దు బైక్ కీలు లాక్కోవడం చట్టవిరుద్ధం స్వచ్ఛంద చెల్లింపే మార్గం నిరాకరిస్తే కోర్టు నోటీసులే పరిష్కారంప్రజల బ్యాంక్ ఖాతాలపై చేయి వేసే 'ఆటో డెబిట్ సిస్టమ్' రాజ్యాంగ విరుద్ధం. తొందరపాటు, బేస్‌లెస్ ప్రకటనలు న్యాయస్థానాల్లో నిలవవు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. చట్టం ముందు అందరూ సమానులే.

## మంత్రి కొండా సురేఖ కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ జనవరి22( సమయం న్యూస్) :** జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర న్యాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలికిన వారిలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఎఫ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో రత్నకళ్యాణి, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్--2025 లకు ఫిబ్రవరి 3 లోగా దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్, జనవరి 22 : ( సమయం న్యూస్) :** జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్--2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవార్డుల వివరాలకు https:/filmin.telangana.gov.in అనే వెబ్సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

## మేడారం జాతర కు తొలిసారి గా వాట్సప్ సేవలు

**మేడారం జనవరి22( సమయం న్యూస్) :** మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భక్తులు 76589 12300 నంబర్‌కు 'Hi' అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన పూర్తి వివరాలు పొందవచ్చు. జాతర రూట్ మ్యాప్, ట్రాఫిక్ అప్‌డేట్స్, పార్కింగ్, వైద్య కేంద్రాలు, స్నానఘట్టాలు తదితర సమాచారం నేరుగా వాట్సాప్‌లో లభించనుంది. ఈ సేవలతో భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది

## అడిషనల్ కలెక్టర్ ఆస్తులు వందల కోట్లు.





గతనెలలో రూ.60 వేల లంచం తీసుకుంటూ దొరికిన హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో ఇవాళ రైడ్స్ చేసింది. సోదాల్లో రూ.4.65 కోట్ల విలువైన విల్లా, ఒక ఫ్లాట్, 8 ఓపెన్ ప్లాట్లు, 14.5 ఎకరాల వ్యవసాయ భూమి పేపర్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని అంచనా. రూ.30లక్షల నగదు, 297 గ్రా. బంగారం, రూ. 44.04 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ గుర్తించింది. ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది.

## ఫిబ్రవరి చివరి నాటికి ప్యాక్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మార్చి వరకు పి.హెచ్.సి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- మంథని లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



**మంథని, జనవరి 22( సమయం న్యూస్). :** పెద్దపల్లి జిల్లాలో సహకార సంస్థల ఆధ్వర్యంలో చేపడుతున్న పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని, ఫిబ్రవరి నెలాఖరు లోగా గ్రిడ్ కు అనుసంధానం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం కన్నాల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాగారం గ్రామంలో ఎంపిపిఎస్, పీ. హెచ్.సి సబ్ సెంటర్ , గుంజపడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీ. హెచ్.సి భవనం, జడ్పీహెచ స్, 1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణం, మంథని లోని ఆర్డిఓ కార్యాలయ నిర్మాణ పనులు, జడ్పీహెచ స్ బాలికలు, బుట్టుపల్లి లోని ఆర్ అండ్ ఆర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కన్నాల పాఠశాలలో ప్రహరి గోడ, గేట్ ఏర్పాటు, మైనర్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నాగారం గ్రామం లోని పాఠశాలలో మంజూరు చేసిన పనులు, సబ్ సెంటర్ నిర్మాణ పనులు నెల రోజుల్లో లోగా పూర్తి చేయాలని అన్నారు. గుంజపడుగు జడ్పీహెచ స్ లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. గుంజపడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణ పనులు, అవసరమైన పరికరాల బిగింపు పూర్తి చేసి మార్చి నాటికీ హ్యాండ్ ఓవర్ చేయాలనిఅన్నారు. గుంజపడుగు లో ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ పనులు పూర్తి చేసి ఫిబ్రవరి చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుతో పాటు, సమాంతరంగా విద్యుత్ రవాణా కోసం ట్రాన్స్ మిషన్ లైన్ నిర్మాణ పనులు కూడా రెండు రోజుల్లో మొదలు పెట్టాలని, దీనికి డిస్కం అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. రెడ్కో, విద్యుత్ శాఖలను మంచి సమన్వయం చేస్తున్నారని డిసీఓ ను అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా సహకార రంగంలో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టులు పెద్దపల్లి జిల్లాలో చేపట్టడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నామని, అందుకు సంబంధిత అధికారులు సంకల్ప సిద్ధితో కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా గోదాముల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. బిట్టు పల్లి ఆర్‌డఆర్ కాలనీ లో పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని అన్నారు. ఆర్ డఆర్ కాలనీ లో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డీసీఓ శ్రీమాల, రెడ్కో జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్, కేడీసీసీ బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు, ఎంపిడిఓ శ్రీజ, తహశీల్దార్ అరీఫోద్దిన్, ఏడీఈ వెంకటనారాయణ, రెడ్కో డిఓ మునీందర్, ఏడీఓ లక్ష్మీకాంత్, గ్రీన్ సెక్యూర్ రమాకాంత్ , ఏఈ పి.ఆర్. అనుదీప్, విక్రమ్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో భాగంగా పోలీసుల అవగాహన చర్యలు

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలమేరకు
- కుల్కచర్ల ఎస్సై వి.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన



**చౌడాపూర్ మండలం, జనవరి,22(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా జనవరి 1 నుంచి జనవరి 31 వరకు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా మాసిక కార్యక్రమాలలో భాగంగా, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చలానాలు విధించడంపై కాకుండా ప్రజల్లో అవగాహన పెంచే దిశగా కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు, కుల్కచర్ల పోలీస్ స్టేషన్ ఎస్సై వి. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, కుల్కచర్ల పరిధిలోని సంతలు, షాపులు, కిరాణా దుకాణాలలో ప్రజలు, వినియోగదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. చౌడాపూర్ మండల కేంద్రంలో ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అదేవిధంగా,కాంగ్రెస్, బీఆర స్,బీజేపీ పార్టీలకు చెందిన ఎల్లటి అశోక్, రాందాస్ నాయక్, సలీం, యాదయ్య తదితర పెద్దలతో సమావేశాలు నిర్వహించగా, ఈ కార్యక్రమాల్లో సుమారు 90 నుంచి 95 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో, ఈ-చలానాలు విధించడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి, వాటికి ప్రధాన కారణాలు ఏమిటి, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలు, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో ప్రజలకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కలిగించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా కుల్కచర్ల పోలీసులు చేపడుతున్న ఈ చర్యలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా,ఎస్సై వి. రమేష్ కుమార్‌తో పాటు పీసీలు సతీష్, అంజనేయులు, ప్రవీణ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్లు పాల్గొన్నారు.

## ఓటిపిఎస్ ద్వారా ఇసుక సరఫరా..

- జిల్లాకలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం,జనవరి22(సమయంన్యూస్) :** ఓటిపిఎస్ (ఆన్లైన్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్) ద్వారా పూర్తి పారదర్శకంగా ఇసుక పంపిణీ కి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన ఇసుక వాహనం ఆన్లైన్ వెబ్, మొబైల్ అప్లికేషన్ పై తహశీల్దార్లకు, ఎంపిడిఓలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇసుక పారదర్శకంగా పంపిణీకి ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అప్లికేషన్ అమలుకు వచ్చిన తర్వాత మాన్యువల్ గా ఇసుక పంపిణీ చేయవద్దని కలెక్టర్ అన్నారు. అప్లికేషన్ లాంచ్ కాగానే జిల్లాలో ఉన్న ఇసుక రీచ్ లు, వాటిలో ఇసుక లభ్యతపై జాయింట్ తనిఖీలు చేపట్టి నివేదిక సమర్పించాలన్నారు. డాటాలో ఖచ్చితత్వం ఉండాలని, ఏ మండలంలో, ఏ రీచ్ లో ఎంత క్యూబిక్ మీటర్ల మేర ఇసుక లభ్యత ఉందో అప్లికేషను కు మ్యాపింగ్ చేయాలన్నారు. వచ్చే సోమవారం కల్లా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇసుక పంపిణీకి ధర నిర్ణయం చేపట్టాలన్నారు. సరసమైన ధరలో, సమయానికి ఇసుకను అందిస్తే, వినియోగదారుడు ప్రయివేటు కు వెళ్లి, నాసిరకం ఇసుక కొనే అవసరం కలగదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ అవసరాలకు మొదటగా ఇట్టి అప్లికేషన్ ద్వారా ఇసుక పంపిణీ చేపట్టి, ఆ తర్వాత ప్రభుత్వ నిర్మాణాలకు అమలుచేయనున్నట్లు కలెక్టర్ అన్నారు. మన ఇసుక వాహనం వెబ్, మొబైల్ అప్లికేషన్ పై అధికారులు పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. యాప్ ప్రకారం పంచాయతీ కార్యదర్శులకు క్షేత్ర తనిఖీ, ఆమోదం తెలపాల్సి ఉన్నందున ఇట్టి దానిపై ఎంపిడిఓలు మండల స్థాయిలో వర్క్ షాప్ ఏర్పాటుచేసి పంచాయతీ కార్యదర్శులకు, ట్రాన్స్పోర్ట్ వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆమోదం పిదప తహసీల్దార్ చే టోకెన్ జారీచేయుట జరుగుతుందని అన్నారు. అధికారులు, ప్రజల్లో ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్ పై పూర్తి అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధాకృష్ణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తహశీల్దార్లు, ఎంపిడిఓలకు ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్ పై అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్లు, ఎంపిడిఓలు లేవనెత్తిన సందేహాల నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, ఏడి మైన్స్ సాయినాథ్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు రూ. 165 కోట్లతో రహదారుల నిర్మాణం, పటిష్టత

- 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం



**హైదరాబాద్, జనవరి 22( సమయం న్యూస్) :** ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ గిరిజన జాతర ప్రారంభానికి మరో ఐదు రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటికే మేడారానికి ప్రతీ రోజూ లక్షలాది మంది భక్తులు ముందస్తు మొక్కులకై తరలి వస్తున్నారు. కేవలం, జాతర జరిగే జనవరి 28 వతేదీ నుండి 31 తేదీ మధ్యలోనే దాదాపు కోటిన్నరకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున, మేడారానికి వచ్చే ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉండే రహదారులతో పాటు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్వహించే రహదారులన్నింటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వివిధ శాఖల క్రింద మేడారానికి దారితీసే 39 ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా, మరో 10 రోడ్లను, మూడు కల్వర్టు లను కొత్తగా నిర్మించారు. జాతీయ రహదారులకు చెందిన 8 రహదారుల పటిష్టత, మర మ్మతు, నూతన బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ. 360 లక్షలతో చేపట్టి పూర్తి చేశారు. వీటిలో, ప్రధానంగా, కటాక్షపూర్, మల్లంపల్లి లవద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా దాదాపు రూ. 102 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం, పటిష్ట, ఇతర సివిల్ పనులు రికార్డు సమయంలో పూర్తిచేశారు. ఈ శాఖ క్రింద ఉన్న పస్రా నుండి భూపాల పల్లి వరకు 33 కిలోమీటర్లు, తాడ్వాయి నుండి నార్లాపూర్ వరకు 20 కిలోమీటర్లు, చిన్నబోయినపల్లి నుండి ఊరట్టం వరకు 23 కి.మీ. రహదారుల పటిష్టత, రీకార్పెటింగ్ చేపట్టారు. వీటితోపాటు, చిలకల గట్టు సమ్మక్క మార్గం నుండి గద్దెల వరకు, సమ్మక్క టెంపుల్ వద్ద, పోలీస్ క్యాంపు ల వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీస్ క్యాంపు వద్ద హెలిపాడ్స్ నిర్మాణం, మరమత్తులు చేపట్టడం జరిగింది. పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 52 .21 కోట్ల వ్యయంతో 84 పనులు చేపట్టడం జరిగింది. ఇదేకాకుండా, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 8.08 కోట్ల వ్యయంతో 3 కొత్త భవనాల నిర్మాణం, 29 ప్రస్తుత భవనాల మరమత్తులు, 5 కొత్త రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టి పూర్తి చేశారు.

1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం... మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో ప్రయివేటు వాహనాలలో భక్తులు వస్తారు. లక్షల సంఖ్యలో వచ్చే ఈ వాహనాల పార్కింగ్ కు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా. 43 ప్రాంతాల్లో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను కల్పించారు. వీటిలో, అటవీ శాఖకు చెందిన 15 ప్రాంతాలలో 235 ఎకరాల్లో, ట్రైబల్ వెల్ఫేర్, పట్టా భూములకు చెందిన 24 ప్రాంతాల్లో 1164 ఎకరాల్లో, ప్రభుత్వ భూములకు చెందిన 3 ప్రాంతాల్లో 19 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయంతో పాటు ఇక్కడ ఉండే భక్తులు, డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ తదితర సౌకర్యాలను కల్పించారు.

# బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ జనవరి22( సమయం న్యూస్) :** ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గత రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని రవాణా, పోలీస్, రోడ్లు భవనాలు, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, రోడ్లు భవనాలు, రవాణా అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలపై, ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్– జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగుల మేర చదును చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు, లైటింగ్ తదితర ఏర్పాట్లు అవసరం ఉన్నాయని, తాము సూచించిన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను, అక్కడ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన విధంగా నగరంలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, సోలార్ లింకింగ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్ మాట్లాడుతూ జాతీయ రహదారి 563లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను గురించి వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ డిఎం సునంద, ఏసీపీ వెంకటస్వామి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేస్లాపూర్ నాగోబను దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ఇంద్రవెల్లి జనవరి22( సమయం న్యూస్). :** ఆదిలాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కేస్లాపూర్ నాగోబ దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని నాగోబ స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి గారికి పూజారులు, మెస్రం వంశీయులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో నాగోబ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని మంత్రి ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతికి, ఆదివాసీల సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన కేస్లాపూర్ నాగోబ క్షేత్రం విశిష్టత అపూర్వమని పేర్కొన్నారు. నాగోబ జాతర సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, వారికి అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐ టి డి ఏ పి ఓ యువరాజ్ మర్మట్, అధికారులు, మెస్రం వంశీయులు, భక్తులు పాల్గొన్నారు.

# మార్కోడు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం జనవరి22( సమయం న్యూస్) :** మార్కోడు గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ తదితర మౌలిక వసతులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్ల పరిశీలన సమయంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, తక్షణమే చర్యలు తీసుకొని నిరంతర నీటి సరఫరా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో పాఠశాల భవనంలో లికేజీ సమస్య ఉన్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, స్టాక్ రిజిస్టర్లు, వంట నిర్వహణ విధానాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన రుచికరమైన భోజనం తప్పనిసరిగా అందించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వంటకట్టెలపై ఆధారపడుతున్న పరిస్థితిని గమనించిన కలెక్టర్, గ్యాస్ సరఫరా ఏర్పాట్లకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మూడవ, ఆరవ, ఎనిమిదవ తరగతుల గదులను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యను అభ్యసించడంలో శ్రద్ధ చూపాలని, జీవిత లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని సమయాన్ని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలిస్తూ బోర్డుపై రాయించి, పుస్తకాలు చదివించి వారి అభ్యాస స్థాయిని పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశా లల్లో విద్యార్థులకు సురక్షిత వాతావరణంతో పాటు మెరు గైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, పోషకాహారం తప్పనిసరిగా అందాలని తెలిపారు. పాఠశాలల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని, చిన్న లోపం కూడా విద్యార్థుల ఆరోగ్యం మరియు భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు. మరుగుదొడ్లు, నీటి సరఫరా, హాస్టల్ వసతులు ఎల్లప్పుడూ సక్రమంగా ఉండేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మార్కోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న కొత్త తరగతి గదులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి, పది రోజుల్లోగా అన్ని పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, ఎలాంటి లోపాలు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా చేపడుతున్న నిర్మాణాలకు అవసరమైన విద్యుతీకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు మ-ంత్తయ్య, రామకృష్ణ, బోధన, బోధనే తర సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తి...ఆరోగ్యం దాయకం.

- ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి



**కోస్గి మండలం, జనవరి,22(సమయం న్యూస్) :** చదువుతోపాటు ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి కలిగి ఉంటే ఎంతో ఆరోగ్యదాయకంగా ఉంటుందని పదోనోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా నారాయణ పేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదారుడ్యశీతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందాలంటే ఇష్టమైన ఆటలను నిత్యం సాధన చేస్తూ ఉండాలని తద్వారా సంబంధిత క్రీడాల్లో మరింత నైపుణ్యం సాధించవచ్చునని సూచించారు. పాఠశాల స్థాయిలో జరిగే ప్రతి క్రీడా పోటీలలో ఆసక్తిగా పాల్గొనాలని, తగిన శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మొదటిరోజు క్రీడాపోటిల్లో భాగంగా బాలుర, బాలికల, సీనియర్ కబడ్డీ పోటీలతో పాటు ఖోఖో పోటీలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో పి.ఇ.టీ రాజు నాయక్, ఉపాధ్యాయులు సిద్రాములు,వార్ల మల్లేశం, సంతోష్, మల్లయ్య, భీమయ్య రహమత్ పాషా, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కలిసివచ్చే వామపక్ష లౌకిక పార్టీలతో కలిసి సిపిఐ పోటీ

- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**చేవెళ్ల, జనవరి 22.:( సమయం న్యూస్) :** ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్య నాయకుల సమావేశం చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి కే రామస్వామి అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో చేవెళ్ల ,మొయినాబాద్ శంకర్పల్లి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలలో సిపిఐ పార్టీ తో కలిసి వచ్చే లౌకిక వామపక్ష పార్టీలతో భారత కమ్యూనిస్టు పార్టీ మున్సిపల్ ఎన్నికల పోటీలో ఉంటుందని చేవెళ్ల మున్సిపాలిటీలో 4 వార్డులు, మొయినాబాద్ మున్సిపాలిటీలో 3 వార్డులు శంకర్పల్లి మున్సిపాలిటీలో 3వార్డులు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2 వార్డుల లో భారత కమ్యూనిస్టు పార్టీ పోటీలో ఉంటుందని తెలిపారు .నిరంతరం ప్రజా పోరాటాలు కార్మిక పోరాటాలలో ముందుండి పోరాటం చేసే భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజల అండదండలు ఉన్నాయని ప్రజా పోరాటాలే మా పార్టీకి బలం అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం ప్రభులింగం జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి శంకర్పల్లి మండల కార్యదర్శి సుధీర్ ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్ బి కే ఎం యు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ శౌరీలు శివ పాపయ్య పెంటయ్య తదితరులు పాల్గొన్నారు

# హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

**కొత్తగూడెం జనవరి 22( సమయం న్యూస్) :** హత్య కేసులో జీవిత ఖైదీ విధిస్తూ కొత్తగూడెం ప్రధాన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు కు చెందిన మహమ్మద్ మహబూబ్ బాష 25 ఆగస్టు 8 న తాను మణుగూరు పోలీస్ వారికి ఇచ్చిన ఫిర్యాదు లో తన తో కలిసి నలుగురు అన్నదమ్ములు ముగ్గురు అక్క చెల్లెళ్ల ల మీద తన తల్లి ఏం.డి.లాల్ బీ తమ పేరు మీద 12 సంవత్సరంల క్రితం డబ్బులు ఫిక్స్ డిపాజిట్ చేసినద ని అవి అన్నదమ్ము లందరూ సమానంగా పంచుకోమని చెప్పగా హామీ ఇచ్చాను. అని ఫిక్స్ డిపాజిట్ ను రద్దు చేసి డబ్బులు తీసుకోగా 8 లక్షలు రాగా అట్టి డబ్బులు నలుగురం అన్నదమ్ముల పంచుకుందామని మా మూడవ అన్న మహమ్మద్ ఇబ్రహీం సుందరయ్య నగర్ మణుగూరు కు చెందిన మా అన్న మహమ్మద్ ఇబ్రహీం మాపై గొడవ చేస్తూ డబ్బులు నాకు సగం రావాలని నా ఒక్కని కే సగం వాటా ఇవ్వలేదని గొడవ పడ్డాడు అప్పటినుండి మూడవ అన్న మహమ్మద్ ఇబ్రహీం మాపై కక్ష పెంచుకొని మమ్మల్ని చంపుతానని బెదిరించే వాడు. పార్టీ డబ్బులు సగం ఇవ్వలేదని తనతో తన భార్యతో గొడవ పడినాడ ని వారి అంతు చూస్తామని మిమ్మల్ని భూమి మీద బతకానివ్వన ని బెదిరించేవాడ ని సుమారు వారం రోజుల క్రితం కూడా ఇబ్రహీం తన ఇంటి దగ్గరికి వచ్చి బెదిరించాడని తన భార్య హబీబిబి ప్రతి ఈరోజు ఉదయం నీటి పంపు దగ్గరికి వెళ్లి నీళ్లు తీసుకొని వస్తుందని అలాగే 2020 ఆగస్టు 8 న ఉదయం 7:30 కు నీటి కొరకు వెళుచుండ గా వెనుక నుండి మహమ్మద్ ఇబ్రహీం వచ్చి పొడవైన కత్తితో మెడమీద నరికి పారిపోయినాడు. చుట్టుపక్కల వారు 108 ను పిలిపించ గా వచ్చి పరీక్షించగా అక్కడే తన భార్య చనిపోయినదని ఏం.డి.ఇబ్రహీం కు సగం డబ్బులు ఇవ్వలేదని కక్ష పెంచుకొని కిరాతకంగా చంపాడని తగిన చర్య తీసుకోమని మణుగూరు పోలీసు వారికి ఫిర్యాదు చేయగా అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం .ఏ. షూ కూర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారని, మరియు అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. భాను ప్రకాష్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 15 మంది సాక్షులను విచారించారు. మహమ్మద్ ఇబ్రహీం పై నేరాభియోగము రుజువు అయినదని కోర్టు భావించి జీవిత ఖైదు మరియు రూ .1,000/- జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పి.వి.డి. లక్ష్మి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ప్రస్తుత మణుగూరు ఎస్. హెచ్. ఓ. పి. నాగబాబు కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్ .వీరబాబు,( కోర్టు డ్యూటీ ఆఫీసర్ )పిసి ఎం. అశోక్ లు సహకరించారు.

# బాధితులకే ప్రాధాన్యం: తెలంగాణ పోలీసుల విక్టిమ్ సెంట్రిక్ విధానం



**హైదరాబాద్ జనవరి22( సమయం న్యూస్) :** బాధితులకే ప్రాధాన్యం: తెలంగాణ పోలీసుల విక్టిమ్ సెంట్రిక్ విధానంతెలంగాణ పోలీసులు నేర బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు 'విక్టిమ్ సెంట్రిక్' విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం ద్వారా ఇకపై బాధితులు పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా, పోలీసులే వారి ఇంటికి వెళ్లి ఖీ×= నమోదు చేస్తారు. అకారణంగా బాధితులను పోలీస్ స్టేషన్లకు తిప్పినట్లయితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. బాధితులు తమ ఫిర్యాదులను వాట్సాప్ నంబర్ 9490616555 ద్వారా కూడా తెలియజేయవచ్చని సూచించారు.

# రైల్వే బ్రిడ్జి పై రబ్బర్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని సిపిఎం రాస్తారోకో




**ఖమ్మం , జనవరి 22 :( సమయం న్యూస్ ):** స్థానిక చర్చి కాంపౌండ్ రైల్వే బ్రిడ్జి పై విరిగిన జాయింట్ రబ్బర్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఎం శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. చర్చి కాంపౌండ్‌నుండి ప్రకాష్ నగర్ కు అనుసంధానంగా ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జాయింట్ రబ్బర్ స్టిక్స్ పూర్తిగా పాడు అవడంతో...టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశాయి. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి , వెంటనే సమస్య పరిష్కారం చేయాలి సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై . విక్రమ్ కోరారు.

## జగదేవ్ పూర్ మండలంలో జిల్లా కలెక్టర్ తనిఖీలు.



**జగదేవ్ పూర్ జనవరి22( సమయం న్యూస్).:** జగదేవ్ పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. భాగరా అన్నం, ఆలుగడ్డ చిక్కుడు టమాటా మిక్స్ కూరలను తనిఖీ చేశారు. విద్యార్థులను వడ్డించే ప్రక్రియలో విద్యార్థుల అన్నం కి సరిపోయేంత కూరను పెట్టాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని మీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులతో పలకరిస్తూ కూరలో చిక్కుడు, ఆలు ముక్కలను పడవెయ్యవద్దని అన్ని మంచిగా నమిలి తినాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కూర్చుని తినెదగ్గరుకు వెళ్లి అన్నం కూర వడ్డించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు చదువు మధ్యాహ్న బోజన విషయం లో రాజీపడవద్దని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం జగదేవ్ పూర్ మరియు కొండపాక మండలాల తహసిల్దార్ కార్యాలయంలో ఎలక్ట్రోరల్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆయా మండలాల్లో ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నందున అసహనం వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ మ్యాపింగ్ 100 శాతం పూర్తి చెయ్యాలి. ఆయా వార్డుల వారిగా జీపిఓలు, సూపర్ వైజర్ లు, బిఎల లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రోగ్రెస్ తక్కువున్నా పోలింగ్ స్టేషన్ లలో బి ఎల్ ఓ ల పనితీరును పర్యవేక్షణ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలు వేగవంతం చేయాలని ప్రతి రోజు చేసిన మ్యాపింగ్ వివరాలు కంప్యూటర్ లో అప్లోడ్ చేసే ప్రక్రియను పరిశీలించారు.

## చేవెళ్ల చైర్మన్ పీఠం బీజేపీ మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం



**చేవెళ్ల, జనవరి:22లి(సమయం న్యూస్) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని, చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం ధీ మా వ్యక్తం చేశారు. గురువారం చేవెళ్ల మున్సిపల్లో 18వ వార్డులో కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ నాయకులు రమణ రెడ్డి, పాండురంగ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి సమక్షంలో నాయకులు పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువత, సీనియర్ నాయకులు పార్టీలోకి రావడం శుభపరిణామమని అన్నారు. పార్టీలో చేరిన వారు, మాజీ వార్డు మెంబర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు బంటు జనార్ధన్, తెలుగు శ్రీనివాస్, బంగారు శివకుమార్, కావాలి భార్గవ్, ఋషి కుమార్, శివ సాయి, గుడిసె మహేందర్, తుప్పరి నరేందర్, దాసరి వెంకటేష్, బురాన్ మహేష్ మరియు సాకలి మహేందర్ తదితరులు బీజేపీలో చేరారు.

## తాండూర్ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన బి.మధుసూదన్ రెడ్డి



**తాండూర్ మున్సిపల్, జనవరి,22(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా తాండూర్ నూతన కమిషనర్ గా బి .మధుసూదన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ సిబ్బంది డీ ఈ ఈ మణిపాల్ ,మేనేజర్ నరేందర్ రెడ్డి, ఏ ఈ ఖాజా హుసేన్ ఉన్నారు..

# నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.




**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను హాజరయ్యారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అదే విధంగా కలెక్టరేట్ లోని సంబంధిత విభాగం అధికారులు ఎస్సీ ఎస్టీ కేసులలో బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో పాల్గొన్న డిఎస్పి నల్ల పు లింగయ్య 2023 లో 31, 2024 లో 34, 2025 లో 24 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు అయ్యాయని, 2025 లో నమోదైన కేసులలో 4 కేసులు భూ సమస్యల పరిష్కారం కోసమే పెట్టారని తెలిపారు. మరో 2 కేసులకు చార్జిషీట్ వేయడం జరిగిందని , మరో 3 కేసులకు సంబంధించి డాక్యుమెంట్స్ రావాల్సి ఉందని, ఒక కేసు మైనర్ కు సంబంధించినదిగా డీఎస్పీ వివరించారు. ఆయా కేసులలో ఎఫ్. ఐ. ఆర్ కానీ చార్జిషీట్ కానీ, డీసీ ఆర్ బి నుంచి అవుతాయని చెప్పారు. 2024 లో జరిగిన ఓ హత్య కేసు గురించి కలెక్టర్ ఆరా తీయగా, ఆ కేసులో మద్యం మత్తులో ఓ వ్యక్తి కొట్టడంతో అవతలి వ్యక్తి చనిపోయాడని, నిందితుడికి జైలు శిక్ష పడిందని డీఎస్పీ తెలిపారు. ఒక కేసు ఫాల్స్ గా నిర్ధారణ అయిందన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో నష్టపరహారం ఎంత మందికి అందించారని కలెక్టర్ ప్రశ్నించగా సీ సెక్షన్ అధికారిని జయసుధ 2023 నుంచి ఇప్పటిదాకా ఎఫ్ ఐ ఆర్ అయిన 17 కేసుల బాధితులకు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, మిగతా కేసులలో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రొసీడింగ్స్ సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. మిగతా కేసుల నష్టపరిహారం కోసం మొత్తం 40.45 లక్షల ప్రతిపాదనలు పంపించడం జరిగిందని కలెక్టర్ కు తెలిపారు. ప్రతి నెలా 30 న సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నాం అని డీ ఎస్పీ తెలపగా, ఆయా మీటింగుల మినిట్స్ ఇవ్వడం లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఇకపై నెల నెలా చేసిన మీటింగ్ మినిట్స్ పంపించాలని ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కిష్ట్యా నాయక్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసులు తొందరగా నమోదు చేయడం లేదని నాలుగైదు రోజుల తర్వాత చేస్తున్నారని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేయకపోతే నేరుగా తన కార్యాలయంలో వచ్చి తెలియజేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. జిల్లాలో ఎస్టీ విద్యార్థుల కోసం బెస్ట్ అవలెబుల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని, పంచాయతీలుగా మారిన గ్రామాల్లో ఇంటి నంబర్ల ను మార్చాలని, ప్రభుత్వ పథకాల అమలులో పైలెట్ ప్రాజెక్టు కింద గిరిజన గ్రామ పంచాయతీ నీ ఎంపిక చేయాలని కిష్ట్యా నాయక్ కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైలెట్ ప్రాజెక్టు కింద గిరిజన పంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉల్లాస్ స్కీం అమలు జరుగుతోందని, జిల్లాలో మహిళా అక్షరాస్యత కేవలం 38 శాతమే ఉందని, గట్టు మండలం తర్వాత దేశంలో మహిళా అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నది నారాయణ పేట జిల్లానే అని కలెక్టర్ తెలిపారు. ఉల్లాస్ పథకం లో భాగంగా 4 నెలల వరకు నిరక్షర్యాశులకు వాలంటీర్లను నియమించి ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరుగుతుంది ఆమె తెలిపారు. మరో సభ్యుడు ఆశప్ప మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద 8 ఎకరాలను 1994 దళితులకు ఇండ్ల పట్టాలిచ్చారని, ఆ తర్వాత ఆ స్థలంలో నే డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం చేపట్టారని, ఇప్పుడు అక్కడితోనే ఆగిపోయిందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని దళిత వాడల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆయన కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చివరగా వచ్చే త్రైమాసిక సమావేశంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ లో కొత్త సభ్యులను ఎన్నుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ శైలజ, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ అజీమ్, డీ పీ ఎం జయన్న,తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్ నెం. 10 వద్ద పార్కింగ్ సౌకర్యం

- స్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా
- ప్లాట్‌ఫామ్ నెం. 1 వద్ద పార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేత



**సికింద్రాబాద్ జనవరి22( సమయం న్యూస్) :** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగు పరచడం, స్టేషన్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మరియు మొత్తం కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా దాదాపు రూ. 714.73 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నారు. రైల్వే ప్రయాణికులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించడంతో పాటు, స్టేషన్ ప్రాంగణంలో భద్రత మరియు క్రమశిక్షణను పాటిస్తూ, పనులు యుద్ధప్రాతిపదికన దశలవారీగా మరియు పద్ధతి ప్రకారం కొనసాగుతున్నాయి. ఇటీవల పండుగ రద్దీ ఉన్నప్పటికీ, రైలు సేవలకు గానీ, ప్రయాణికులకు గానీ ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పునరాభివృద్ధి కార్యకలాపాలలో భాగంగా, స్టేషన్ ప్రాంగణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మరియు వాహనాల రాకపోకలను సజావుగా సాగించడానికి చర్యలు ప్రవేశపెట్టబడ్డాయి. ప్లాట్‌ఫారమ్ నంబర్ 1 వద్ద పార్కింగ్ సౌకర్యాన్ని తాత్కాలికంగా నిలిపివేయడమైనది మరియు తక్కువ సమయంలో వాహన రాకపోకలను( పికప్ మరియు డ్రాప్) మాత్రమే అనుమతించబడుతుంది. ప్లాట్‌ఫారమ్ నంబర్ 10 వైపు, అనధికార పార్కింగ్ మరియు వాహనాల అడ్డంకులను నివారించడానికి యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్ అమలు చేయబడింది. ఈ జోన్‌లోకి ప్రవేశించే ప్రయాణీకులకు 15 నిమిషాల వరకు ఉచిత పికప్ మరియు డ్రాప్ సౌకర్యం కల్పించబడింది, ఆ తర్వాత అధీకృత పార్కింగ్ స్థలంలో పార్క్ చేయని వాహనాలపై అదనపు రుసుములు విధించబడతాయి. పునరాభివృద్ధి దశలో నిరంతరాయ ట్రాఫిక్ ప్రవాహాన్ని కొనసాగించడానికి మరియు ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి ఈ చర్యలు ఉద్దేశించబడ్డాయి. అయితే, రైళ్లు ఎక్కడానికి, అలాగే ప్రయాణికుల రాకపోకలకోసం మరియు పార్కింగ్ ప్రయోజనాల కోసం ప్లాట్‌ఫామ్ నెం. 10 వైపున ఉన్న బేస్‌మెంట్‌లో నాలుగు చక్రాల మరియు ద్విచక్ర వాహనాలకు తగినంత పార్కింగ్ సౌకర్యం కల్పించబడింది. ప్రయాణీకులకు సమర్థవంతంగా మార్గనిర్దేశం చేయడంలో భాగంగా ప్రయాణీకుల సౌకర్యం కొరకు స్టేషన్‌లోని ముఖ్యమైన ప్రదేశాలలో స్పష్టమైన దిశానిర్దేశక సంకేతాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా సందేశాలు మరియు ప్రదర్శన బోర్డులు ఏర్పాటుచేయబడినాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నం.10 బేస్‌మెంట్ లో ఉన్న అనుమతించబడిన పార్కింగ్ స్థలాల కోసం ఆమోదించబడిన పార్కింగ్ చార్జీలు క్రింద ఇవ్వబడ్డాయి:

వాహనం రేటు (జి.ఎస్.టితో సహా)
ఛార్జ్ యొక్క కాల పరిమితి నాలుగు చక్రాల వాహనం
రూ. 40/- మొదటి రెండు గంటలు లేదా అంతకు లోపల రూ. 20/- తదుపరి గంట లేదా దానికి లోపల మోటార్ సైకిల్/స్కూటర్/ ద్విచక్ర వాహనం రూ. 25 మొదటి రెండు గంటలు లేదా అంతకు లోపల రూ. 10 తదుపరి గంట లేదా దానికి లోపలబై- సైకిల్ రూ. 5 మొదటి రెండు గంటలు లేదా అంతకు లోపలరూ. 2 తదుపరి గంట లేదా దానికి లోపలపార్కింగ్ ప్రాంతంలోని ప్రముఖ ప్రదేశాలలో కూడా టారిఫ్/రుసుము ప్రదర్శించబడింది

ప్రస్తుతం, 50 శాతం పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి, మిగిలిన పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. మొత్తం ప్రాజెక్టును డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడమైనది. పునరాభివృద్ధి చెందిన స్టేషన్‌లో ప్రయాణీకులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు మరియు సదుపాయాలు ఉంటాయి. ఈ సౌకర్యాలలో ప్లాట్‌ఫామ్ నంబర్ 1 వైపు మల్టీలెవెల్ కార్ పార్కింగ్ సౌకర్యం, ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు బేస్‌మెంట్ పార్కింగ్, పార్కింగ్ సామర్థ్యాన్ని పెంచడం, వాహనాల కదలికను క్రమబద్ధీకరించడం మరియు స్టేషన్‌లో ప్రయాణీకులకు మరియు సందర్శకులకు మెరుగైన సౌకర్యాన్ని ఏర్పాటుచేయడం వంటివి ఉంటాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా, స్టేషన్ వద్ద ఎటువంటి ఇబ్బంది లేని ట్రాఫిక్ కదలిక కోసం మరియు అనధికార పార్కింగ్ వలన విధించే ఓవర్-స్టే ఛార్జీలను నివారించడానికి ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు ఏర్పాటుచేసిన బేస్‌మెంట్ పార్కింగ్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని రైలు వినియోగదారులకు దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ

- డీఎస్పీ నల్లపు లింగయ్య.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు




**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో Arrive Alive కార్యక్రమంలో భాగంగా పాత బస్టాండ్, మట్టన్ మార్కెట్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రజలకు, వాహనదారులకు, డ్రైవర్ లకు డిఎస్పీ నల్లపు లింగయ్య , నారాయణపేట పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... Arrive Alive అంటే ఇంటి నుండి క్షేమంగా వెళ్లి, క్షేమంగా రావడం అని బయటకు వెళ్ళే వారు అంతే క్షేమంగా ఇంటికి వస్తే మంచిది అని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ అని ఆయన తెలిపారు. అలాగే ఒక ఇంట్లో ఒక్క వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని అలాంటివి చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి అని అలాంటివి జరుగకుండా వాటిని దృష్టిలో ఉంచుకొని, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని డీఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు అతి ముఖ్యమైన ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేయడమేనని తెలిపారు.

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని, నిర్దేశిత వేగ పరిమితిని పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను ముఖ్యంగా పరిగణలోకి తీసుకొని వాహనాలు నడపాలని, మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. రోడ్డు భద్రత అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. Arrive Alive కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపిన వ్యక్తికి పూలమాలసి సన్మానించిన డీఎస్పీ. ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్,ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, పోలీస్ సిబ్బంది, ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# కవిగా చచ్చిపోతున్నా..కవితనై పురుడోసుకుంటున్న.



**రాయపోల్,జనవరి 22:**అవును నేను చచ్చిపోతున్నా సమాజంలో జరిగే అసమానతలను చూస్తూ నేను చచ్చిపోతున్నా ...కులం అనే కుళ్ళు పునాదిపై కుతంత్రపు గోడలను నిర్మిస్తున్న మనుషులను చూడలేక నేను కనుమూస్తున్న నేను చచ్చిపోతున్నా..

ఓవైపు ఆడదాన్ని దేవత అంటూ భావిస్తూనే అవకాశం దొరకగానే అనుభవించాలని చూసే మనిషి రూపంలో ఉన్న మృగాలను చూస్తూ జరిగే దారుణాలను ఆపలేక నేను చచ్చిపోతున్నా ....

చదివిన చదువుకు ఫలితం లేక ఉద్యోగం పొందలేక అన్యాయాలను ఆపలేక, అక్రమాలను నివారించలేక నేను చచ్చిపోతున్నా ...

ఎలాంటి ఊడిగమైనా చేస్తాను ఉద్యోగం ఇవ్వండని అడిగితే మీది ఏ కులమని అవతలివారు అడిగితే ఎందుకని ప్రశ్నించలేక మౌనంగా ఉండి పోతున్న నేను చచ్చిపోతున్నా...

కళ్ళ ముందు కనపడే కటిక దారిద్రాన్ని చూడలేక కడుపునిండా తిండి లేక కంటి నిండా నిద్ర లేక నేను చచ్చిపోతున్నా ...

అయినా సరే రెక్కలు ముక్కలు చేసుకుని ఎండనకా వాననక ఎవుసం చేసి పంట పండిస్తే నేను చేసిన ఏటి కష్టానికి ఫలితం కోసం ప్రభుత్వాన్ని మద్దతు ధర అడగలేకపోతున్నా .... నాకు నేను న్యాయం చేసుకోలేకపోతున్నా..

ఇన్ని బాధలు బాధిస్తున్న సేదతీరుదామని బంధంతో బంధువు ఇంటికి వెళితే ఎందుకోసం వచ్చావు? అని వారడిగితే ఏమని చెప్పాలో తెలియక కృంగిపోతున్న అనునిత్యం చచ్చిపోతున్నా....

నోటు కోసం ఓటును అమ్ముకుని ఈ సమాజాన్ని మార్చలేక కన్నవారి కలలను ఓ కొడుకుగా తీర్చలేక నేను చచ్చిపోతున్నా...

త్యాగధనులు మనకు అందించిన నీతి న్యాయాలను కాపాడుకోలేక జరుగుతున్న అన్యాయాలను చూస్తూ నేను తలవాల్చుతున్నా.....

నేను చచ్చిపోతున్నా ...

అభివృద్ధికి నోచుకోని బీద కుటుంబాలను చూస్తూ...

ఆకలి అంటూ ఏడ్చే పేద పిల్లల్ని చూస్తూ ....

అనువంతైన అండగా నిలువలేని నాయకులను ఎదురించలేక నాలో నేనే విమర్శించుకుంటూ వేదన పడుతున్న నేను చచ్చిపోతున్నా..

అవసరానికి తీయగా మాట్లాడి అవసరం తీరాక వెన్నుపోటు పొడిచే నమ్మకద్రోహుల నడుమ జీవించలేక..

నేను చచ్చిపోతున్నా...

మళ్ళీ జన్మంటూ ఉంటే పుస్తకపు పుటల్లో సువర్ణాక్షరాన్నై పుడతా...

కవి చేతిలో కళాన్నై ఉద్భవిస్తా...

ఉవ్వెత్తున ఎగిసిపడే విప్లవ జ్వాలనై తిరిగొస్తా...

స్వీయ రచన

శేఖర్ మహారాజ్ "వాల్మీకి ".

# రంజాన్ పండగ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** వచ్చే నెలలో ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలకు( రోజా), రంజాన్ పండగ రోజు కల్పించాల్సిన ఏర్పాట్ల పై గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా రంజాన్ మాసాన్ని, పండగను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని, రంజాన్ మాస ఉపవాస దీక్షలకు అవసరమైన వసతి, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు పట్టణంలో తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కోరారు.ముఖ్యంగా ఆ నెల మొత్తం విద్యుత్ సరఫరా కు ఆటంకం లేకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీటితో పాటు మసీదులు, ఈద్గాల వద్ద రోజూ సాయంత్రం మున్సిపాలిటీ చెత్త ఆటో రిక్షా ను అందుబాటులో ఉంచాలని, ఇఫ్తార్ ముగిసిన తర్వాత వ్యర్థ పదార్థాలను ఆ ఆటో రిక్షాల లో వేస్తారని లేదంటే ఆయా ప్రాంతాల్లో దుర్గంధం నెలకొంటుందని చెప్పారు. రంజాన్ పండగ కు పది రోజుల ముందు పట్టణంలో దుకాణాలు రాత్రి వేళల్లో తెరచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని, పండగ షాపింగ్ ఎక్కువగా రాత్రి వేళల్లోనే చేస్తారని మైనార్టీ నాయకులు తెలిపారు. రంజాన్ పండగ రోజు ఈద్గా వద్ద షామియానాలు, టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలని వారు కోరారు. రంజాన్ పండగ రోజు ఈద్గా వద్ద కు రావాలని జిల్లా కలెక్టర్ ను నాయకులు కోరారు. మైనార్టీ నాయకులు కోరిన వాటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శాఖల వారీగా అధికారులు ఆయా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామంలోనూ తగిన ఏర్పాట్లు చేయాలని డిపివో సుధాకర్ రెడ్డి కి కలెక్టర్ సూచించారు. అయితే రంజాన్ నెలలోనే హోలీ పండుగ వస్తుందని, పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముందస్తు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా పోలీసు శాఖ ఇచ్చిన రాత్రి సమయం సడలింపును కొందరు యువకులు దుర్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, అలా జరగకుండా ముస్లిం మత పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని డీ ఎస్పీ కోరారు. ఏదైనా చిన్న సంఘటన జరిగినా పట్టణ పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్పీ డాక్టర్ వినీత్ మైనార్టీ నాయకులకు సూచించారు. జిల్లాలో పోలీసు స్టేషన్ ల వారీగా శాంతి సమావేశాలు ఏర్పాటు చేసి, పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. కాగా రంజాన్ నెలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగితే విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ 8712470307 ను సంప్రదించాలని విద్యుత్ శాఖ అధికారి కోరారు.ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, మున్సిపల్ మేనేజర్ అజీమ్, మైనార్టీ నాయకులు అమీరొద్దీన్, సర్ఫరాజ్ అన్సారి, మహిముద్ ఖురేషీ, అజీమ్ మడ్కీ, ఫిరోజ్,మహిమూద్,అజహర్, ఎం.ఐ.ఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పట్టణ అధ్యక్షుడు తఖి, ఫీర్ తఖి తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్





**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** జిల్లాలోని నారాయణ పేట,మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీ ల లోఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని గురువారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్, గద్వాల, వనపర్తి, నాగరకర్నూలు, నారాయణ పేట జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూమున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు.వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆర్.ఓ ఏ.ఆర్.ఓ ల ను గుర్తించడం జరిగిందని తెలిపారు. .పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. మొత్తం 4 మున్సిపాలిటీలకు గాను 149 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, అవసరమైన బ్యాలెట్ బాక్స్ లు సిద్ధంగా ఉన్నట్లు,పోలింగ్ కేంద్రాల్లోవెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్,ఎస్.ఎస్.టి బృందాల కు మెజిస్టీ రీయల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.కాగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక జిల్లా అదనపు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, నోడల్ అధికారులు,మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

● గ్రామ సర్పంచ్ వీరేశం, ghmo రవీందర్ గౌడ్.



**బొంరస్ పేట మండలం, జనవరి,22(సమయం న్యూస్) :** బొంరస్ పేట మండల విద్యా వనరుల కేంద్రం ( నందు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండరు స్థానిక సర్పంచ్ వీరేశం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌదర్పల్లి +ఎవీ రవీందర్ గౌడ్ గురువారం ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె. విజయ వర్ధన్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ బోంరాస్ పేట్ మండల శాఖ అధ్యక్షులు. బాకారం. చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ భావాలు కలిగి, క్రమశిక్షణ, అంకితభావం, దేశభక్తి భావంతో పనిచేసే ఉపాధ్యాయ సంఘం తపస్ సంఘం అన్నారు.తపస్ సంఘం అన్ని సంఘాలను కలుపుకుంటూ సమస్యల సాధనకు ముందు ఉంటుందని తెలపడం జరిగింది.విద్యార్థుల సంక్షేమానికి, వారిలో క్రమ శిక్షణ,దేశభక్తి భావాలు పెంచడానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు. అలాగే తపస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు బి. మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి మరియు ఉపాధ్యాయుల సమస్యల సాధనకు నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం తపస్ సంఘం అన్నారు.గడువు తీరిన పీఆర్సీ సాధనకు,(ఉపాధ్యాయుల పేరిజన్- పిఆర్సి) కరువుపత్యాలు (డీ. ఏ) జిపిఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులు,మెడికల్ బిల్లులు ,ు ఫైనల్ బిల్స్,సరెండర్ బిల్స్ ,పెన్షనర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు.సమస్యల సాధనలో ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉంటుందని తెలపడం జరిగింది. అలాగే నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తూ గ్రామ సర్పంచ్ వీరశం మాట్లాడుతూ తపస్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలే కాకుండా, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, దేశభక్తి భావాలు పెంచడానికి మార్గదర్శకత్వం వహించాలని తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న కె. విజయ వర్ధన్ మాట్లాడుతూ క్రమశిక్షణ,అంకితభావంతో,జాతీయ భావాలు కలిగి ,ఆ ప్రమాణాలు పాటించడంలో తపస్ సంఘం ముందు ఉంటుందని అభిప్రాయపడ్డారు..ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీ ప్రియ,మండల ప్రధాన కార్యదర్శి.ఏ.మహేష్ ,ఆదర్శ్, ప్రశాంత్ కుమార్, మోహన్, రఘు,మేడిశెట్టి ప్రశాంత్ కుమార్ జ.న.వీ. మండల ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల దరఖాస్తుల పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం , జనవరి 22 : ( సమయం న్యూస్ ) :** మైనారిటీ గురుకుల పాఠశాల గర్ల్స్ ( ఖమ్మం ) 5 వ, 6 వ, 7 వ,8 వతరగతి ప్రవేశాలకు ఆన్ లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభ అయిన సందర్భంగా గురువారంపోస్టర్ ను పాఠశాల లోఅబ్దుల్ మలిక్ మీడియా సెక్రెటరీ జమాఅతె ఇస్లామీహింద్, ఖమ్మం), షేక్ ఖాసీం (ఎంపీజే జిల్లా అధ్యక్షులు), హకీమ్ (ఎంపీజే ఉపా అధ్యక్షులు), మౌలానా సాధిక్ ఇమామ్ (మసీద్- ఇ- ఇబ్రహీం), ఆర్ ఎల్ సి ఎం జె అరుణకుమారి ,పాఠశాల ప్రిన్సిపాల్ ఎం శైలజ , ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లితండ్రులు సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ యం. శైలజ మాట్లాడుతూ పాఠశాల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు , అధ్యాపకులతో నాణ్యమైన విద్య పోషకాహారంతో పాటు నిరంతర పర్యవేక్షణలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు.పాఠశాల 5 వ తరగతి లో 51 ముస్లిం, 5 క్రిస్టియన్స్, 1 జైన్, 1 పార్సి, 1 బౌద్ధ, 1 సిక్కు,6 వ తరగతి లో 24 ముస్లిం 7 వ తరగతి లో 4 ముస్లిం, 8 వ తరగతి లో 8 ముస్లిం సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇదే విధంగా దరఖాస్తుల వివరాల కోసం 7331170860ను సంప్రదించగలరని అన్నారు.

# హెల్మెట్, సీటుబెల్ట్ లేకుండా వాహనం నడిపితే ప్రాణాలతో చెలగాటమే

● నారాయణపేట రూరల్ ఎస్సై రాముడు



**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన Arrive Alive కార్యక్రమంలో భాగంగా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నారాయణపేట రూరల్ ఎస్సై రాముడు ఆధ్వర్యంలో ప్రజలకు, వాహనదారులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రాముడు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం భద్రతా నియమాల పట్ల నిర్లక్ష్యమే. రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. ఇవి శిక్షల కోసం కాదు, మీ ప్రాణాల రక్షణ కోసం" అని స్పష్టం చేశారు.అలాగే "ఒక్క క్షణం నిర్లక్ష్యం జీవితాంతం బాధను మిగులుస్తుంది. మీ కోసం కాదు, మీ కుటుంబాల కోసం అయినా రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలి అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, వాహనదారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# పథకం ప్రకారం అణచివేతకు గురవుతున్న ముస్లిం మైనార్టీలు

● మహమ్మద్ సలాం



**ఖమ్మం , జనవరి 22 : ( సమయం న్యూస్ ) :** ప్రస్తుతం ముస్లిం మైనార్టీలను ఒక పథకం ప్రకారంగా అణిచి వేస్తున్నరని సిపిఐ జిల్లా నాయకులు , ఇన్సాఫ్ రాష్ట్ర ఆర్గానిజింగ్ కార్యదర్శి మొహమ్మద్ సలాం ఆరోపించారు. గురువారం ఖమ్మంలో జరిగినముఖ్యుల సమావేశంలో సలాం మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అన్ని రకాల ప్రయోగాలతో మైనార్టీలను వేధిస్తూ, భయ బ్రాంతులకు గురి చేస్తూ ఉందని విమర్శించారు.తనకు ఇష్టం వచ్చిన చట్టాలు తీసుకోస్తు మైనార్టీల పై రుద్దుతూ చివరికి దాడులుతో చంపుతున్నారనిమస్జీద్ లను ఒక పథకం ప్రకారంగా కూల్చివేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.అనేక రాష్ట్రాలలో తప్పుడు కేసులతో జైలు లో పెడుతున్నారని సలాం తీవ్రంగా విమర్శించారు. మన రాష్ట్రం లో ఏ ప్రభుత్వం వచ్చిన ఏ పథకం కూడా మైనారిటీలకు అంద లేదని ,రిజర్వేషన్ అమలు కాలేదని, ఉపాధి అవకాశాలు లెవ్వని ,కేవలం మాటల గార్వీడితో పక్కదోవ పట్టిస్తున్నారని, దుయ్యబట్టారు. ఇప్పుడుకైనా ముస్లిం మైనార్టీలు , ఎస్సీ, ఎస్టీలు, బీసీలు కళ్ళు తెరవాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. సైదా, ఎండీ. రెహమాన్, జల నర్సింహారావు, నిజాంపేట్ యాఖుబ్, ఎస్.కె . చానా, ఎన్ .విజయ్ కుమార్, డాక్టర్ ఖాసీం , పాషా, ఎండీ మజీద్, ఎస్కే. కరీంత పాల్గున్నారు.

# తిమ్మక్కపల్లి దొంగతనం కేసు ఛేదన



● రూ.50 వేల నగదు స్వాధీనం.

**రాయపోల్, జనవరి 22:** మండలం లోని తిమ్మకపల్లి గ్రామంలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించినట్లు తొగుట సర్కిల్ సీఐ ఎస్కే లతీఫ్ తెలిపారు. ఈ కేసులో నిందితుడు ఎంకొల్ల రాజు (35), తండ్రి పోచయ్య,తిమ్మకపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ లతీఫ్ మాట్లాడుతూ తేదీ 03-01-2026 అర్ధరాత్రి సమయంలో శివోల్ల రమేష్ ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి దేవుని గదిలో ఉన్న బీరువా తాళం విరిచి అందులోని రూ.50 వేల నగదును దొంగిలించినట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.సిద్దిపేట కమిషనర్ సాదన రశ్మి పేరుమల్ పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు,తొగుట సీఐ ఎస్కే లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానసల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలిస్తుండగా తిమ్మకపల్లి బస్టాప్ వద్ద నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు.

## రాయపోల్‌లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు

- బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన




**రాయపోల్, జనవరి 22:** రాయపోల్ మండల కేంద్రంలో ఆర్థిక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ బ్యాంకు పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ కమిటీ) సభ్యులు బాగన్న గారి రవీందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీబీఐ బ్యాంకు మేనేజర్ సిమ్జిత్ పాల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జేఎస్‌బీవై, పీఎం జేజేవై, ఏపీవై, ఎస్ఎస్‌వై వంటి పథకాల ద్వారా సామాన్య ప్రజలకు ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. అలాగే రైతులు, మహిళలు, యువత బ్యాంకు ఖాతాలను చురుకుగా వినియోగించుకుంటూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ఏపీఎం యాదగిరి, సర్పంచ్ రాజు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందుతుడు అరెస్ట్ రిమాండ్

- చింతకాని ఎస్సై వీరేందర్



**ఖమ్మం, జనవరి 22 : (సమయం న్యూస్ ) :** జిల్లాలోని చింతకాని మండల పరిధిలో గల వందనం గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ రావు అతని కుటుంబ సభ్యులతో ఈనెల 15 తారీకు న తిరుపతి దర్శనానికి వెళ్లి , తిరిగి 20వ తారీకు ఇంటికి వచ్చి చూడగా , ఇంటి తాళం పగలగొట్టి ఉండగా గమనించి , ఎవరో దొంగలు పడ్డారని ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు వస్తువులు ,వెండి వస్తువులు, కొంత నగదు , టీవీ కనిపించకపోవడంతో చింతకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి , దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులలో ఒక వ్యక్తిని ఈరోజు చింతకాని ఎస తన సిబ్బందితో వందనం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దొంగతనం చేసిన సొమ్ముతో ఇద్దరు వ్యక్తుల్లో ఒక వ్యక్తి కాకరకాయల నరేష్ (వందనం గ్రామం) అను వ్యక్తి పారిపోతుండగా పట్టుకొని అతని వద్ద నుండి దొంగతనం చేసిన వస్తువులను స్వాధీనం పరుచుకొనిఅతని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించడం జరిగింది మరో నిందితుడు కందుకూరి సోమాచారి (సత్తుపల్లి) పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ సందర్భంగా ఎస్సై ఎన్ వీరేందర్, ఏఎస లక్ష్మణ్ చౌదరి, హెడ్ కానిస్టేబుల్ లు రాములు శ్రీనివాస్ , పోలీస్ కానిస్టేబుళ్లు గజేంద్ర ,శ్రీనివాస్ లను , వైరా ఇంచార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ అభినందించారు.

## శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ఇప్పటికి 143 వారాలుగా అన్నదాన కార్యక్రమం



**కొడంగల్ మున్సిపల్ (మం) జనవరి,22(సమయం న్యూస్) :** శ్రీ సత్య సాయి భజన మండలి కొడంగల్, తాండూర్ సమితి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కొడంగల్ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికీ (143) వారాలుగా అన్నదానం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దశరథ్,జి. శ్రీనివాస్ యాదవ్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడే జాతీయ ఓటర్ల దినోత్సవం

- 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25కు బదులుగా జనవరి 23 నిర్వహణ




**పరిగి,జనవరి,22(సమయం న్యూస్) :** రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనవరి 24, 25 తేదీలు సెలవు దినాలుగా ఉండటంతో, ఈ ఏడాది 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25కు బదులుగా నేడు అనగా జనవరి 23, న ఉదయం 11.00 గంటలకు నిర్వహించనున్నట్లు సాధారణ పరిపాలన (ఎన్నికలు) శాఖ ప్రకటించింది.

ఈ నేపథ్యంలో వికారాబాద్ ఆర్డీవో ఈఆర్వో ఆదేశాల మేరకు పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఏఈఆర్వోలు, తహసీల్దార్లు జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని "మై ఇండియా -- మై ఓట్" అనే ప్రధాన థీమ్‌తో పాటు "భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు" అనే ట్యాగ్‌లైన్‌తో నిర్వహించనున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, యువతను ఓటర్లుగా నమోదు చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

# ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత పాటించాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్-సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** జిల్లాలోని ప్రతీ ఆహార వ్యాపార సంస్థ ( యూనిట్) తప్పనిసరిగా పరిశుభ్రత, పారిశుద్ధ్య పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఫుడ్ సేఫ్టీ జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి లో మొదటి సారి జరిగిన ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీ ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జయ చంద్రమోహన్, ఫుడ్ సేఫ్టీ అధికారి మౌనిక, డిపివో సుధాకర్ రెడ్డి, డీ డబ్ల్యు ఓ అధికారి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో ఫుడ్ సేఫ్టీ గురించి చర్చించారు. ప్రతి ఆహార వ్యాపార యూనిట్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి నెలా రిజిస్ట్రేషన్/లైసెన్స్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఫుడ్ సేఫ్టీ అధికారి మౌనిక తెలిపారు. ఇష్టపడేవారు దరఖాస్తు చేసుకోవచ్చనీ, లైసెన్స్ అక్కడికక్కడే ఇవ్వబడుతుందని ఆమె చెప్పారు. ఆహార భద్రతా అధికారి ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, అనుమానిత నమూనాలను సేకరించి హైదరాబాద్ నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించడం జరుగుతుందని, ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాబ్ నివేదిక నాణ్యత లేనిది అయితే తీర్పు కేసు నమోదు చేయబడుతుందనీ, 5 లక్షల వరకు జరిమానా విధించబడుతుందనీ ఆమె హెచ్చరించారు. ఇప్పటివరకు జిల్లాలో 17 తీర్పు కేసులు దాఖలు చేయబడ్డాయనీ , 2 విచారణలో ఉన్నాయని, మూడవ త్రైమాసికంలో మొత్తం 164 రిజిస్ట్రేషన్లు, 44 లైసెన్సులు జారీ చేయబడ్డాయని ఫుడ్ సేఫ్టీ అధికారి కలెక్టర్ కు వివరించారు. త్వరలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్ వాడీ కేంద్రాలలో ఫుడ్ సేఫ్టీ, తాగునీటి నమూనాలను సేకరించి క్యాబ్ కు పంపించడం జరుగుతుందని మౌనిక తెలిపారు. ఆయా పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్ వాడీ కేంద్రాలకు లైసెన్సులు కూడా జారీ చేస్తామని, లైసెన్సు కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆమె సూచించారు.

# దాబాలలో మద్యం విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు

- నారాయణపేట ఎస్పై వెంకటేశ్వర్లు



**నారాయణపేట, జనవరి,22(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని పలు దాబాలలో అక్రమంగా మద్యం విక్రయించడం, మద్యం సేవించేందుకు అక్రమ సిట్టింగ్లు నిర్వహించడం జరిగితే దాబా యజమానుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ఈరోజు సాయంత్రం ఆకస్మికంగా పలు దాబాలను తనిఖీ నిర్వహించామని, దాబాలలో మద్యం విక్రయించడం గానీ, మద్యం సేవించేందుకు సిట్టింగ్లు ఏర్పాటు చేయడం గానీ చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దాబా యజమానులు చట్టాలను కచ్చితంగా పాటించాలని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు 8 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు

- లేదంటే పనులు రద్దు చేయండి
- ఎంపీ నిధుల నుండి ఇచ్చిన ప్రతి అభివృద్ధి పురోగతి పనులు పబ్లిక్ డొమైన్ లో ఉండాలి.
- టెక్నికల్ సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలి
- ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హన్మకొండ జనవరి22( సమయ్యం న్యూస్) :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎంపీ ఛాంబర్‌లో చీఫ్ ప్లానింగ్ అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల నుండి మొత్తం రూ. 8 కోట్ల 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల లోపు పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో పనులు రద్దు చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఎంపీ నిధుల ద్వారా చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పురోగతి వివరాలు తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి టెక్నికల్ సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. నియోజకవర్గంలోని మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, విద్య వంటి రంగాలతో పాటు ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేసే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమ ంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మా రామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారి కిషన్, డిడబ్ల్యుఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

**కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నిర్వాహకులకు కలెక్టర్ హితవు**



**నిజామాబాద్, జనవరి 22( సమయం న్యూస్) :** కస్తుర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ లో చదువుకుంటున్న ప్రతి బాలికను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ, వారి బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేయాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి నిర్వాహకులకు హితవు పలికారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్ళను సాధికారతతో దీటుగా ఎదుర్కోవడం, బాలికల్లో మానసిక స్థైర్యం పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను కలిగి ఉండడం తదితర అంశాలపై కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్స్ కేర్ టేకర్లు, వార్డెన్లకు విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కపిల హోటల్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు ఆయా అంశాలలో అందిస్తున్న శిక్షణ గురించి విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. క్షేత్రస్థాయిలో కేజీబీవీ బాలికలకు ఎదురైన పలు సున్నితమైన సమస్యలను పరిష్కరిస్తూ, వారిని మానసికంగా కుంగుబాటుకు గురి కాకుండా తీసుకున్న చర్యల గురించి ఈ సందర్భంగా పలువురు స్పెషల్ ఆఫీసర్లు ఆయా ఉదంతాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ళు బాలికల సామాజిక, మానసిక వృద్ధికి వికాస కేంద్రాలుగా దోహదపడాలని, కేవలం చదువులోనే కాకుండా అన్ని అంశాలలో విద్యార్థినులను ప్రతిభావంతులుగా తయారు చేయాలని నిర్వాహకులకు ఉద్బోధించారు. బాలికలు అనేక సమస్యలతో సతమతం అవుతారని, వారి పట్ల ఆప్యాయతను చూపితే తమ ఇబ్బందులను నిర్భయంగా చెప్పుకుంటారని, తద్వారా వాటిని పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. విద్యార్థినుల మానసిక స్థితి, ప్రవర్తనను గమనిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. బాలికలపై లైంగికపరమైన దాడులకు సంబంధించిన కేసులలో ఎక్కువగా దగ్గరి సంబంధీకులే అఘాయిత్యాలకు ఒడిగడుతున్నందున, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ గురించి ప్రతి బాలికకు పరిపూర్ణమైన అవగాహన కల్పించాలన్నారు. సానుకూల దృక్పథంతో వారు ముందుకు సాగేలా విద్యార్థి దశ నుండి వారి ఆలోచనలను తీర్చిదిద్దుకునేలా కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో బాలురు, బాలికలు అనే అంతరం చూపకుండా నైతికత, సత్ప్రవర్తన విషయంలో అమ్మాయిల తరహాలోనే అబ్బాయిలకు కూడా తల్లిదండ్రులు సమాన స్థాయిలో ఆంక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్ళలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ చూపుతానని, ఎలాంటి వసతులు కావాల్సి ఉన్నా తన దృష్టికి తేవాలని నిర్వాహకులకు సూచించారు. శిక్షణ తరగతులలో నేర్చుకున్న అంశాలు కేజీబీవీ, మోడల్ స్కూళ్ళ నిర్వహణను మెరుగుపరుస్తూ, బాలికల అభ్యున్నతికి దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జీసీడీఓలు భాగ్యలక్ష్మి, సుకన్య, విజయలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్స్ కేర్ టేకర్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన సింధు



## కెరీర్‌లో 500వ విజయం నమోదు

### ఈ ఘనత సాధించిన తొలి భారతీయ షట్లర్ - ఇండోనేషియా మాస్టర్స్ క్వార్టర్స్‌కు చేరిక

**జకర్తా, జనవరి 22 :**
భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అరుదైన రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కెరీర్‌లో 500 విజయాలు సాధించి చరిత్ర లిఖించారు. ఇండోనేషియా మాస్టర్స్-2026లో భాగంగా డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ హోజ్‌మార్క్‌పై గెలిచి ఈ మైలురాయిని చేరుకున్నారు. ప్రపంచంలో మహిళల సింగిల్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన ఆరో ప్లేయర్‌గా, భారత్ తరపున తొలి క్రీడాకారిణిగా సింధు నిలిచారు.

**వరుస సెట్లలో విజయం**

తాజాగా జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు 21-19, 21-18 తేడాతో లైన్ హోజ్‌మార్క్‌పై వరుస సెట్లలో గెలుపొందారు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 43 నిమిషాల్లోనే ఆటను ముగించారు. హోజ్‌మార్క్‌పై సింధుకు ఇది ఐదో విజయం. ఇప్పటివరకు సింధు తన కెరీర్‌లో 732 మ్యాచ్‌లు ఆడగా, అందులో 500 మ్యాచ్‌ల్లో విజయం సాధించడం విశేషం.

**క్వార్టర్స్‌లో చైనా క్రీడాకారిణితో పోరు**

ఈ విజయంతో సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. తదుపరి మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్, వరల్డ్ నెంబర్ 4 చెన్ యూఫీతో తలపడనున్నారు. వీరిద్దరి మధ్య ఇప్పటివరకు జరిగిన 13 మ్యాచ్‌ల్లో చెన్ యూఫీ 7-6 ఆధిక్యంలో కొనసాగుతున్నారు. చివరిసారిగా 2019లో చెన్ యూఫీపై గెలిచిన సింధు, ఈసారి కూడా నెగ్గి రికార్డు సమం చేయాలని భావిస్తున్నారు.

## నేను పరుగు తీసేలోపే..

# అతడు హాఫ్ సెంచరీ కొట్టాడు



### అభిషేక్ శర్మపై సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం

- నా కాలంలో ఆ బంతుల్లో ఒక పరుగు చేసేవాడిని.. ఇతను 50 కొట్టాడు

**హైదరాబాద్, జనవరి 22 :**
భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ యువ సంచలనం అభిషేక్ శర్మపై ప్రశంసల జల్లు కురిపించారు. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ ఇప్పుడు క్రీడా లోకంలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం 35 బంతుల్లో 84 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ యువ ఆటగాడి శైలిని గవాస్కర్ కొనియాడారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ బ్యాటింగ్ వేగాన్ని తన కాలం నాటి క్రికెట్‌తో పోలుస్తూ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**ఆశ్చర్యపరిచే బ్యాటింగ్ శైలి**

మ్యాచ్ ముగిసిన తర్వాత ఒక క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన సునీల్ గవాస్కర్, అభిషేక్ శర్మ బ్యాటింగ్ పట్ల తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. "ప్రస్తుత తరం ఆటగాళ్ల బ్యాటింగ్ శైలిని చూస్తుంటే అద్భుతంగా అనిపిస్తోంది. అభిషేక్ శర్మ కేవలం 18 బంతుల్లోనే తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. నిజం చెప్పాలంటే, నా కాలంలో నేను ఒక పరుగు తీయడానికి ఎన్ని బంతులు తీసుకునేవాడినో, ఇప్పుడు ఈ కుర్రాడు అన్ని బంతుల్లో ఏకంగా యాభై పరుగులు పూర్తి చేస్తున్నాడు" అని గవాస్కర్ చమత్కరించారు. తన సుదీర్ఘ కెరీర్‌లో గవాస్కర్ రక్షణాత్మక ధోరణికి పేరుగాంచిన సంగతి తెలిసిందే. అందుకే ప్రస్తుత టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్లు చూపిస్తున్న ఈ దూకుడును ఆయన వింతగా, అద్భుతంగా భావిస్తున్నారు.

**హిట్టింగ్ మాత్రమే కాదు.. టైమింగ్ కూడా**

అభిషేక్ శర్మ కేవలం కళ్లు మూసుకుని బ్యాట్ ఊపడం లేదని, ప్రతి షాట్ వెనుక ఒక పద్ధతి ఉందని గవాస్కర్ విశ్లేషించారు. "చాలామంది యువ ఆటగాళ్లు కేవలం హిట్టింగ్ చేయడానికే ప్రయత్నిస్తారు. కానీ అభిషేక్ దగ్గర సరైన టైమింగ్ ఉంది. అతను మైదానం నలుమూలల షాట్లు ఆడగలడు. ముఖ్యంగా స్పిన్నర్లపై అతను విరుచుకుపడుతున్న తీరు భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకం" అని పేర్కొన్నారు. కివీస్ బౌలర్లు ఎంత వేగంగా బంతులు వేసినా, ఎంతో ప్రశాంతంగా, భయం లేకుండా వాటిని సరిహద్దులు దాటించాడని, ఇలాంటి నిర్భయమైన క్రికెట్ ఇప్పుడు భారత జట్టుకు చాలా అవసరమని గవాస్కర్ అన్నారు.

## టీ20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్‌కు ఛాన్స్?

- భారత్‌కు వచ్చేది లేదని తేల్చి చెప్పిన బంగ్లాదేశ్
- నిర్ణయం మార్చుకోకపోతే వేటు తప్పదు: ఐసీసీ హెచ్చరిక
- బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకునే యోచన
- 24 గంటల డెడ్‌లైన్ విధించిన అంతర్జాతీయ మండలి




**దుబాయ్/ఢాకా, జనవరి 22 :**
2026 టీ20 వరల్డ్ కప్ కోసం భారత్‌కు తమ జట్టును పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మరోసారి స్పష్టం చేసింది. గురువారం ఢాకాలో క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్, సీనియర్ ఆటగాళ్లు, బోర్డు సభ్యుల మధ్య జరిగిన కీలక సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. భారత్‌లో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని, అందుకే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ పట్టుబడుతోంది. ఈ నిర్ణయం పూర్తిగా తమ ప్రభుత్వానిదేనని ఆసిఫ్ నజ్రుల్ తెలిపారు.

బంగ్లాదేశ్ అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తిరస్కరించింది. భారత్‌లో ఆటగాళ్లకు ఎలాంటి ముప్పు లేదని స్వతంత్ర భద్రతా సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. టోర్నీకి కొద్ది రోజుల ముందు షెడ్యూల్ మార్చడం అసాధ్యమని తేల్చి చెప్పింది. నిర్ణయం మార్చుకోవడానికి బంగ్లాదేశ్‌కు 24 గంటల సమయం ఇస్తున్నామని, ఒకవేళ రాకపోతే వారి స్థానంలో 'గ్రూప్-సి'లో స్కాట్లాండ్ జట్టును చేరుస్తామని హెచ్చరించింది. దీనిపై ఇప్పటికే బోర్డులో ఓటింగ్ కూడా జరిగినట్లు సమాచారం.

ఐసీసీ అల్టిమేటంపై బీసీబీ ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం ఘాటుగా స్పందించారు. ఒక అంతర్జాతీయ సంస్థ ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. తమ దేశంలో 20 కోట్ల మంది క్రికెట్ అభిమానులు ఉన్నారని, తాము లేకపోతే ఐసీసీకే భారీ నష్టమని వ్యాఖ్యానించారు. శ్రీలంకను 'కో-హోస్ట్' అని పిలవడాన్ని తప్పుబడుతూ, అది కేవలం 'హైబ్రిడ్ మోడల్' మాత్రమేనని అన్నారు. రాజకీయ ద్వేషంతో తీసుకుంటున్న ఈ నిర్ణయాలు బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వరల్డ్ కప్ నుంచి వైదొలిగితే భవిష్యత్తులో ఐసీసీ నిధులు ఆగిపోవడంతో పాటు, ఇతర దేశాలతో ద్వైపాక్షిక సిరీస్‌లపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారత్ వంటి బలమైన బోర్డుతో సంబంధాలు దెబ్బతింటే బంగ్లాదేశ్ క్రికెట్ ఆర్థికంగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఐసీసీ డెడ్‌లైన్ ముగిశాక ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అక్షర్ పటేల్ కు గాయం...
# టీమిండియా ఆందోళన

**నాగ్‌పూర్, జనవరి 22:** న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టి20 మ్యాచ్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు డారిల్ మిచెల్ కొట్టిన షాట్‌ను ఆపే క్రమంలో బంతి అక్షర్ ఎడమ చేతి చూపుడు వేలికి బలంగా తాకింది. దీంతో రక్తం కారడంతో తన ఓవర్ పూర్తి చేయకుండానే మైదానం నుంచి వెళ్లిపోయారు. మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశారు. 2026 టి20 ప్రపంచ కప్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అక్షర్.. ఈ గాయం కారణంగా టోర్నీకి దూరమవుతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గాయం తీవ్రతపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.




# జట్టు ఎంపిక కత్తి మీద సాము

### అందరినీ సంతృప్తి పరచలేం.. పక్కన పెడితే ఆటగాడికి కారణం చెప్పాల్సిందే: రోహిత్ శర్మ

**నాగ్‌పూర్, జనవరి 22:** జట్టును ఎంపిక చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని, ఈ విషయంలో అందరినీ సంతృప్తి పరచలేమని టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అన్నారు. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టి20 వరల్డ్ కప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. జట్టు ఎంపిక, కెప్టెన్సీ సవాళ్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యం జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇది కెప్టెన్‌కు కత్తి మీద సాము లాంటిదని రోహిత్ పేర్కొన్నారు. అయితే ఒక ఆటగాడిని పక్కన పెట్టినప్పుడు, ఎందుకు ఎంపిక చేయలేదో కచ్చితంగా వివరించాలని అభిప్రాయపడ్డారు. "2022 ఆసియా కప్, వరల్డ్ కప్ సమయంలో శ్రేయస్ అయ్యర్‌ను కాదని, జట్టు సమతుల్యత కోసం దీపక్ హుడాను తీసుకున్నాం. ఈ విషయాన్ని నేను, కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా అయ్యర్‌కు వివరించాం. అలాగే 2023 వన్డే వరల్డ్ కప్‌లో చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో సిరాజ్ విషయంలోనూ ఇదే పద్ధతి పాటించాం" అని రోహిత్ గుర్తు చేసుకున్నారు.





# చిరు మూవీలో కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.

# ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లోకి దురంధర్



బాలీవుడ్‌లో ఎలాంటి భారీ అంచనాలు లేకుండా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసిన లేటెస్ట్ సెన్సేషన్ 'దురంధర్'. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్లింది. ఇండియన్ ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటించి మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకోగా, సారా అర్జున్ హీరోయిన్‌గా ఆకట్టుకుంది. అలాగే అక్షయ్ ఖన్నా చేసిన స్పెషల్ రోల్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. దురంధర్ మూవీ త్వరలోనే ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం జనవరి 30 నుంచి దురంధర్ సినిమాను నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ వార్త బయటకు రావడంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులతో పాటు, ఇప్పటికే చూసినవాళ్లు కూడా మళ్లీ మళ్లీ చూడాలని ఆసక్తి చూపిస్తున్నారు. ఓటీటీలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.థియేటర్ కలెక్షన్లతోనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ కూడా రాబోతున్న విషయం తెలిసిందే. దురంధర్ సీక్వెల్‌ను మార్చి 19న విడుదల చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

# విశాల్ మొగుడు ప్రోమో

తమిళ నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 36వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. ఈ సినిమాకు హిట్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహించబోతుండగా.. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న నాలుగవ చిత్రమిది. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రోమోను విడుదల విడుదల చేసింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'మగ మహారాజు', 'మదగజరాజా', 'యాక్షన్' సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రూపొందుతోంది. ఈ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు ఒక కీలక పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన ప్రోమో ఫుల్ ఫన్నీగా మరియు మాస్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. ముఖ్యంగా 'మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం' అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ నవ్వులు పూయి-ంస్తోంది. ఇందులో తమన్నా భర్తను శాసించే భార్యగా కనిపిస్తుంటే, విశాల్ ఇంట్లో పనులు చేసే అమాయకపు భర్తగా నటిస్తూనే.. భార్యకు తెలియకుండా బయట విలన్ల తాట తీసే మాస్ క్యారెక్టర్‌లో అదరగొట్టాడు.




# 26న డేవిడ్ రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల



మంచు మనోజ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్, ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద గట్టి దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డేవిడ్ రెడ్డి' కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ జనవరి 26న, అంటే రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో మెగా యాక్షన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఒక్కసారిగా జోష్ పెరిగింది.ఒక భీకరమైన శకం మొదలవుతోంది అంటూ మనోజ్ పెట్టిన క్యాప్షన్ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో హింట్ ఇస్తోంది. ఈ చిత్రానికి హనుమ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, 'కె.జి.ఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా, ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి, ÷ట్ మాస్టర్ సుప్రీమ్ సుందర్ వంటి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పనిచేస్తుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, హ్యాష్ ట్యాగ్‌లు చూస్తుంటే మనోజ్ ఈసారి మాస్ అండ్ వయోలెంట్ లుక్‌లో కనిపించబోతున్నట్లు అర్థమవుతోంది.



## హిందీలో సంక్రాంతికి వస్తున్నాంలో రాశీఖన్నా

దక్షిణాదితోపాటు అటు హిందీలోనూ అప్పుడప్పుడూ అవకాశాల్ని అందుకుంటున్న రాశీఖన్నాకి అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించే అవకాశం సొంతమైనట్టు సమాచారం. తెలుగులో విజయవంతమైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని హిందీలో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా రీమేక్ చేస్తున్నారు. ఇందులో భార్య పాత్రలో విద్యాబాలన్ నటిస్తుండగా, ప్రియురాలి పాత్రలో రాశీఖన్నా నటించనున్నట్టు సమాచారం. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్ర రాశి సొంతమైందన్నమాట. మొదట మీనాక్షి పేరునే పరిశీలించిన చిత్రబృందం, ఆ తర్వాత ఆ పాత్ర కోసం రాశిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

# బోర్డర్-2 విడుదలకు గల్ఫ్ దేశాలు నిరాకరణ?

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' జనవరి 23న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్- పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్' 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జిత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# పటిష్ట ప్రణాళికతో ఉద్యోగుల సమస్యల పరిష్కారం

## దశల వారీగా బకాయిల చెల్లింపునకు కృషిచేస్తున్నాం

### ఎన్‌జీజీవో నేతలతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని.. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు కృషిచేస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు సంక్రాంతి పండగ సందర్భంగా డీఏ బకాయిల మంజూరు చేసిన నేపథ్యంలో ఏపీ జేఏసీ ఛైర్మన్, ఎన్‌జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలువురు ఎన్‌జీజీవో నాయకులు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సచివాలయంలోని ఆయన ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, కరువు భత్యం విడుదల మరియు మహిళా ఉద్యోగులకు సంబంధించిన చైల్డ్‌కేర్లు పై వయోపరిమితే ఎత్తివేయడం వంటి విషయాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఇందుకు ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఉద్యోగుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని వేతన సవరణ సంఘం ఏర్పాటు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాలపై మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. గతంలో పెన్షనర్లకు 2018లో ఇప్పటి ప్రభుత్వమే అడిషనల్ క్వాంటంను మంజూరు చేయగా, గత ప్రభుత్వం అందులో కోత విధించడం జరిగిందన్నారు. దాన్ని పునరుద్ధరించవలసిన అవసరం ఉందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని అడిషనల్ క్వాంటం విధానంలో విధించిన కోతను తిరిగి పునరుద్ధరించి పెన్షనర్లను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల పాఠశాలల ఉద్యోగులకు పదవీ విరమణ వయోపరిమితిను 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే విషయమై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ త్వరలో నిర్ణయం తీసుకునేలా చూడాలని కోరారు. మేము 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమకం పొందిన 11 వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ లోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగ సంఘ నేతలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం చర్చించడం జరిగిందని.. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని, ప్రభుత్వం, ఉద్యోగులు వేర్వేరు కాదని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలనే కృతనిశ్చయంతో గౌరవ ముఖ్యమంత్రి ఉన్నారని, ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామని ఈ నేపథ్యంలోనే సంక్రాంతికి కూడా ఉద్యోగులను పెన్షనర్లు దృష్టిలో పెట్టుకుని రూ. 1100 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల, గత ప్రభుత్వంలో కొండలా బకాయిలు పేరుకుపోవడం వల్ల ఓ ప్రణాళిక ప్రకారం, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా, చెల్లింపు ప్రక్రియ చేపడుతున్నామని ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఉద్యోగ సంఘాలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ మరియు గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని, ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఎన్జీజీవో సంఘ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, కోశాధికారి భారతి ప్రసాద్, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మి, ఖజానా శాఖ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, క్యాపిటల్ సిటీ నాయకులు శ్రీధర్, రామకృష్ణ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

### టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



**నర్సీపట్నం:** నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం నర్సీపట్నంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ, ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎం సహాయనిధి ఆపద్బాంధవిలా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అర్హులైన బాధితులకు సత్వరమే సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం మండలాలకు చెందిన లబ్ధిదారులకు దాదాపు రూ. 4.50 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని శారదానగర్‌కు చెందిన చిన్నారి వాగ్దేవి వైద్యం కోసం మంజూరైన రూ. 3,45,679 చెక్కును అందజేశారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన శెట్టి దేముడుకు రూ. 36,327 చెక్కును అందించారు. మాకవరపాలెంకు చెందిన రుత్తల రామయ్యమ్మ కు రూ. 31,843 విలువైన చెక్కును అందజేశారు. నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామానికి చెందిన రొంగలి నూకాలతల్లికి రూ. 36,084 చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ జలాశయ ఛైర్మన్ కరక సత్యనారాయణ, నాతవరం మండలం టిడిపి ప్రెసిడెంట్ నందివల్లి వెంకటరమణ, మాకవరపాలెం మండలం టిడిపి ప్రెసిడెంట్ ఆర్.వై. పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు నాయుడు, శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయ కమిటీ ఛైర్మన్ జంపన నాగేంద్ర రాజు స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### రూరల్ పోలీసుల హెచ్చరిక



**నర్సీపట్నం:** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెట్టుపల్లి గ్రామ శివారులో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, రూరల్ ఎస్సై పి. రాజారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.6,500 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ ఎస్సై రాజారావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని, గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా నారా లోకేష్ ముందస్తు పుట్టినరోజు వేడుకలు



**తడ:** రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 42వ పుట్టినరోజు సందర్భంగా కొండూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాతగుంట సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగి, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి మంత్రికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన పళణి మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం కోసం నారా లోకేష్ సుమారు 2900 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారని ప్రశంసించారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, కాళహస్తి కిష్టయ్య, వెల్లూరు శేషయ్య, పిచ్చేటి తిరుపాలు, తొప్పాని కొండయ్య, మింజూరు కొండయ్య, గుమ్మిడిపూడి వెంకటకృష్ణ, కుప్పంపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు.

# ఇండియన్ కోస్ట్ గార్డ్ స్వర్ణోత్సవ బైక్ ర్యాలీకి ఘన స్వాగతం



**సూళ్లూరుపేట:** ఇండియన్ కోస్ట్ గార్డ్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం నుంచి చెన్నై వరకు నిర్వహిస్తున్న బైక్ ర్యాలీకి సూళ్లూరుపేటలో ఘన స్వాగతం లభించింది. కమెండెంట్ దిలీప్ ఆధ్వర్యంలో 20 మంది కోస్ట్ గార్డ్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొంటూ, తీరప్రాంత భద్రతతో పాటు మత్స్యకారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీహరికోట మెరైన్ సీఐ ఈ. మాలకొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ ఓ. వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది భూదనం టోల్ గేట్ వద్ద కోస్ట్ గార్డ్ బృందాన్ని ఘనంగా స్వాగతించారు. అనంతరం కోస్ట్ గార్డ్ సిబ్బందితో కలిసి సూళ్లూరుపేట పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగిసిన అనంతరం తడ సరిహద్దు వద్ద కోస్ట్ గార్డ్ బృందానికి పోలీసులు వీడ్కోలు పలికారు. దేశ తీరప్రాంతాల రక్షణలో కోస్ట్ గార్డ్ సేవలు అపారమని, వారి స్వర్ణోత్సవం దేశానికి గర్వకారణమని ఈ సందర్భంగా అధికారులు ప్రశంసించారు.

# బాలరాముని సేవలో ఏపీ అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్



**అయోధ్య:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గురువారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా బాలరాముడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి చేరుకున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్లకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించగా, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా తన సతీమణితో కలిసి రాముడిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, వేదఆశీర్వచనం గావించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వారు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఆచరించారు.

# చెట్టుపల్లిలో పల్లె పండుగ రెండో దశ పనులకు శ్రీకారం

### రూ.60 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం



**నర్సీపట్నం:** మండలంలో గల చెట్టుపల్లి గ్రామంలో పల్లె పండుగ రెండో దశ అభివృద్ధి పనులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ దశలో రూ.60 లక్షల వ్యయంతో ఆరు సిమెంట్ రోడ్లు సహా సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నర్సీపట్నం జడ్పీటిసి సుకల రమణమ్మ, టిడిపి జిల్లా అధికారి ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి, నర్సీపట్నం మండల టిడిపి అధ్యక్షులు సుకల అప్పలనాయుడు పర్యవేక్షణలో, కూటమి నాయకుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి మాట్లాడుతూ, చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు చెట్టుపల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. గ్రామ ప్రజల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి సమపాళ్లలో జరుగుతుందని, మరో 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ ప్రెసిడెంట్ అప్పికొండ రాజు, ఉప సర్పంచ్ గజాల సూరిబాబు, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం,రమణ, రెల్లి సంఘం నాయకులు ఎర్రం శెట్టి పాపారావు, మోపాడ సత్యప్రసాద్, మట్ట సతీష్, పచ్చికారి ఈశ్వరరావు, కరణం సంతోష్, మాజీ సర్పంచ్ అగ్రహారపు రమణ, వసంత నాగేష్, టిడిపి పార్టీ అధ్యక్షులు కలిమి సత్తిబాబు, గజాల నానాజీ, వడ్డి శ్రీను, ఎర్ర ఈశ్వరరావు, వెలంకాయల బుజ్జి, ములకపాక నానాజీ, అగ్రహారపు రామకృష్ణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఏఆర్ ఎస్సైలకు జిల్లా ఎస్పీ అభినందనలు

### జిల్లా పోలీస్ వ్యవస్థ బలోపేతానికి సహకరించాలి : ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి:** పదోన్నతి అనేది బాధ్యతను పెంచుతుందని, నూతన హోదాలో మరింత అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆకాంక్షించారు. ఇటీవల ఏఆర్ఎస్ఐలుగా పదోన్నతి పొంది, అనకాపల్లి జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో బాధ్యతలు స్వీకరించిన 8 మంది అధికారులు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీకి పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లా పోలీసు వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు. తమపై నమ్మకంతో పదోన్నతి కల్పించినందుకు తమను అభినందించినందుకు ఏఆర్ఎస్ఐలు ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్పీని కలిసిన వారిలో డి.పి. పైడినాయుడు, కె.జె.ప్రకాష్, డి.తాతంనాయుడు, ఎం.బ్రహ్మ, కె.ఎస్.మూర్తి, బి.వై.నాయుడు, ఎల్.సన్యాసినాయుడు, ఎం.ఎ.నయీమ్ వున్నారు.

# రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగం

**సీసీటీవీ కెమెరాల ఏర్పాటు లక్ష్యం**

**ఇప్పటికే 14వేలు పూర్తి చేసిన ప్రభుత్వం**

**జిల్లా కలెక్టర్లతో సీఎస్ విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్**

**అమరావతి :** రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 14 వేలకు పైగా కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ ఉల్లంఘనలను అదుపు చేసేందుకు సీసీటీవీ కెమెరాలను రియల్ టైం గవర్నెన్ కేంద్రంతో అనుసంధానించి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వపరంగా వివిధ ముఖ్య కూడళ్ళు, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలు తదితర చోట్ల ఏర్పాటు చేసిన 14వేల సీసీటీవీ కెమెరాలు అన్నీ సక్రమంగా పని చేసేలా చూడాలని కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సీసీటీవీ ప్రాజెక్టు, డాక్యుమెంట్ అప్-లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై ఏపీ సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. అయితే, జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నీ సక్రమంగా పని చేసేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించి సీసీటీవీలు అన్నీ కెపనిచేసేలా చూడాలన్నారు. ఇక, వివిధ పట్టణ ప్రాంతాల్లో 123 సీసీటీవీ కెమెరాలు పని చేయడం లేదని గుర్తించినట్లు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యకర్శి కె. సురేష్ కుమార్ వివరించారు. వెంటనే అన్ని పని చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా మరో 188 కొత్త కూడళ్ళను గుర్తించి అక్కడ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు ఇప్పటికే ఏజెన్సీకి పనులు అప్పగించడం జరిగిందని, జిల్లా కలెక్టర్లతో తరచు ఈ అంశంపై సమీక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలే కాకుండా సీఎస్ఆర్ నిధులతోనూ, ఇతర విధంగాను ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను కూడా నియంత్రణలోకి తీసుకుని సక్రమంగా పని చేసేలా చూడాలని సీఎస్ విజయానంద్ సూచించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సమ్మె నోటీసు

**ఫిబ్రవరి 12న సమ్మెకు నిర్ణయం**

**విశాఖపట్టణం:** విశాఖ స్టీల్ ప్లాంట్ లో సమ్మె నోటీసును ఇచ్చారు. స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు గురువారం యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తారీకు ఉదయం 6 గంటల నుండి 13 వ తారీకు ఉదయం 6 గంటల వరకు సమ్మె నిర్వహిస్తున్నామని వారు అన్నారు. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 శాతం వ్యూహాత్మక అమ్మకాన్ని తక్షణమే ఉపసంహరించుకొని సెయిల్ లో దీనిని కలపాలని లేదా సొంత గనులు కేటాయించాలని దీనిని బలోపేతం చేయడానికి అప్ స్ట్రీమ్ డౌన్ స్ట్రీమ్ లను ఆప్టిమైజేషన్ చేయాలని వారి డిమాండ్ చేశారు. దీనిని బలహీనపరిచే విధంగా ఈవోఐ లను ప్రకటించిన ప్రభుత్వ యాజమాన్యాలు దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు అన్నారు. అలాగే కార్మికులకు పూర్తి జీతాన్ని చెల్లించాలని, ప్రొడక్షన్ లింక్ జీతాలను చెల్లించే సర్క్యులర్ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, బకాయి పడిన 355శాతం జీతాన్ని చెల్లించాలని, నిలుపుదల చేసిన హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలని, ఉక్కు నగరంలో కరెంటు చార్జీలు తగ్గించాలని, ఆర్థిక మరియు వెల్ఫేర్ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని. గ్రాట్యుటీ 25 లక్షలు గా చెల్లించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ లో నిర్వాసితులచే ఖాళీలు భర్తీ చేయించాలని, ఎ÷-లాంట్లో భద్రత మరియు హాస్పటల్ సౌకర్యాలను మెరుగుపరచాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నామని వారు వివరించారు. మన జీతాలు హక్కుల కోసం జరుగుతున్న ఈ సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు కె ఎస్ ఎన్ రావు, రమణమూర్తి, జె అయోధ్యరామ్, దాలి నాయుడు, సిహెచ్ సన్యాసిరావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు**

**బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ సహా క్లీనర్ మృతి**

**నంద్యాల:** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి హైద్రాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి రోడ్డు డివైడర్ దాటి అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. సిరువెళ్ల మెట్ట పై ట్రావెల్స్ బస్సు, లారీ దగ్ధం అయ్యాయి. బస్సు, లారీ మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయాయి. బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ మంటల్లో మృతి చెందగా బస్సు ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. పలువురికి గాయాలు అయ్యాయి. మంటలు చెలరేగిన వెంటనే అటుగా వెళ్తున్న వాహనదారులు అద్దాలు పగలగొట్టడంతో బయటికి వచ్చారు బస్సులోని ప్రయాణీకులు. పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. సిరువెళ్ల బస్, లారీ దగ్ధం ఘటనలో శ్రీవాణి ఆటో మొబైల్స్ కంటైనర్ లారీలో బైక్ లు రవాణా చేస్తూ దగ్ధం అయ్యింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణీకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ప్రయాణీకులు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ ఓబులేసు అలియాస్ భాస్కర్, (50) సజీవ దహనం అయ్యారు. కడప నివాసిగా గుర్తించారు. మృతిచెందిన లారీ డ్రైవర్, క్లీనర్ లను ఇంకా గుర్తించలేదు. నంద్యాల జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న ఆరుగురు సిరువెళ్ల బస్సు దగ్ధం బాధితులు.. ఇద్దరికి తీవ్రగాయాలు, నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. నంద్యాల ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన ఎస్పీ సునీల్ షెరాన్.. బాధితుల నుంచి ప్రమాదంపై వివరాలు తెలుసుకున్నారు. బస్సు దగ్ధం ఘటనలో గాయపడిన వారు హైద్రాబాద్ వాసులున్నారు.. చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి, హరీష్, సునీత, గాయపడిన మరో ముగ్గురిని పోలీసులు హైద్రాబాద్ కు పంపించారు. సిరువెళ్ల బస్సు దగ్ధమైన ఘటన లో ప్రయాణీకుల ప్రాణాలు కాపాడటంలో కీలకంగా వ్యవహరించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్. క్లీనర్ అప్రమత్తం కాకుంటే ప్రయాణీకుల ప్రాణాలు గాల్లో కలిసేవని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్ కు ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలిపారు. క్లీనర్ ను అభినందించిన పోలీసులు. ప్రయాణీకులను కాపాడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్ సురేంద్ర సకాలంలో స్పందించడంతో ముప్పు తప్పింది.

# మ్యాజిక్ వీవ్స్.. మహిళా సాధికారతకు వేవ్స్!

**జిల్లాలోనూ మ్యాజిక్ వీవ్స్‌కు శ్రీకారం చుడదాం**

**స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూతనిద్దాం**

**ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనలో ముందడుగు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**మంగళగిరి:** మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమం ఔత్సాహిక స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని.. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనలో మరో అడుగు ముందుకేస్తూ ఆశల తరంగాల్లా ఈ వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆప్కో ఆధ్వర్యంలో ఎర్రబాలెంలో అమలవుతున్న మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం పరిశీలించారు. హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ జి.రేఖారాణితో మాట్లాడి కార్యక్రమ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ హితంగా సంప్రదాయ చేనేత కళకు ఆధునిక డిజైన్లను జోడించి.. విలువైన ఉత్పత్తులను రూపొందించడం, తద్వారా అనాథలు, బలహీన వర్గాల వారికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రస్తుతం 30 మంది అనాథ పిల్లలకు వస్త్రాన్ని గ్రేడింగ్ చేసి బ్యాగులు, పౌచ్‌లు, దుస్తులు, ఫైల్ కవర్లు, ఔషధ కిట్లు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ కాలుష్యానికి అడ్డుకట్ట వేస్తూ చిన్న వయసు నుంచే సృజనాత్మకత, పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని రేఖారాణి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విలువ జోడింపుతో ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని.. ఆప్కో ద్వారా వస్త్రాలు, యంత్రాలు, మౌలిక సదుపాయాలు, శిక్షణ, మార్కెట్ లింకేజీ సౌకర్యాల సహకారంతో కార్యక్రమాన్ని జిల్లాలోనూ అమలుచేస్తామని తెలిపారు. ఈ మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమం చేనేత వారసత్వ సంపద పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ఉపాధి సృష్టి, సామాజిక భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందని.. స్వర్ణాంధ్ర సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

**క్షేత్రస్థాయిలో ప్రత్యేక కమిటీ సందర్శన**

**ఆర్‌డీవో కావూరి చైతన్య**



**విజయవాడ:** అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సేకరించిన వివరాలతో నివేదికను రూపొందించడం జరుగుతోందని ఆర్‌డీవో కావూరి చైతన్య అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గురువారం విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య.. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు రెవెన్యూ, విజయవాడ నగరపాలక సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ, సీఐడీ, ఈ-అక్షన్స్ తదితర విభాగాల అధికారులతో కూడిన జిల్లాస్థాయి కమిటీ విజయవాడలోని వివిధ ప్రాంతాలను సందర్శించింది. లోటల్ ల్యాండ్ మార్క్, పాయకాపురం, వాంబే కాలనీలోని మూడు సర్వే నంబర్లలోని భూములను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో చైతన్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌కు సంబంధించి ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సభ్యులు తాజాగా మూడు ఆస్తులను భౌతిక పరిశీలన చేయడం జరిగిందని.. ఈ తనిఖీల్లో సేకరించిన ఆస్తుల సమాచారం ఆధారంగా లిటిగేషన్ లేని భూముల వేలం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా రీసర్వే, ప్రభుత్వ విలువ, మార్కెట్ విలువ, మ్యుటేషన్ తదితర వివరాలతో నివేదికలు పంపనున్నట్లు ఆర్‌డీవో చైతన్య తెలిపారు. క్షేత్రస్థాయి తనిఖీలో జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 23 నుంచి షిర్డీలో ఉద్యోగుల జాతీయ మహాసభలు

**మహాసభలకు తరలివెళ్లిన ఏపీ ఎన్‌జీజీవో ప్రతినిధులు**

**ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సమాఖ్య మహాసభల్లో చర్చిస్తాం**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేస్తాం**

**ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్**




**విజయవాడ:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభల్లో చర్చించి తీర్మానాలు రూపొందించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ తెలిపారు. షిర్డీలో ఈ నెల 23వ తేదీ నుంచి జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణల నేతృత్వంలో దాదాపు 100 మంది ఉద్యోగ సంఘాల నేతల బృందం గురువారం విజయవాడ నుంచి షిర్డీకి రైలు మార్గంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులతో విద్యాసాగర్ మాట్లాడుతూ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ నేతృత్వంలో షిర్డీలో 18వ జాతీయ మహా సభలు జరగనున్నాయన్నారు. మహాసభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1200 మందికి పైగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని.. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఆత్మీయ అతిథులుగా వివిధ సమాఖ్యలకు సంబంధించిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. మన రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన వంద మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సదస్సుకు తరలివెళ్తున్నారన్నారు. సమావేశంలో పాల్గొనే ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యలను ప్రస్తుల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు సానుకూల దృక్పథంతో ఉందన్నారు. మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సిపిఎస్ అంశం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వివిధ రాష్ట్రాలలో ఉన్న వేతన సవరణ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల మీద చర్చ, అంతర్జాతీయంగా జరుగుతున్న వివిధ పరిణామాలపై సమావేశాల్లో చర్చించి, పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి కూడా ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు ఏపీ ఎన్‌జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తెలిపారు. సమాఖ్య జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షిర్డీకి తరలివెళ్లినవారిలో ఎ.విద్యాసాగర్, రమణలతో పాటు రాష్ట్ర సంఘ ప్రతినిధులు భారతీ ప్రసాద్, కె.జగదీశ్వరరావు, సుబ్బారెడ్డి, రంజిత్ నాయుడు, మహిళా ప్రతినిధులు జానకి, రాజ్యలక్ష్మి, శాంతిశ్రీ, సరస్వతి, సురేఖ, శివలీల, విజయశ్రీ, లలితాంబ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు నాగభూషణం, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, విజయవాడ నగరశాఖ ప్రతినిధులు ఉన్నారు.